teenmaardesk@gmail.com

RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...

తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 164 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | మంగళవారం | 8 అక్టోబర్ 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.


## అక్టోబర్ 9న డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు

### ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 07 (తీన్మార్ న్యూస్): డీఎస్సీ అభ్యర్థులకు అక్టోబర్ 9న నియామక పత్రాలు అందజేస్తామన్నారు సీఎం రేవంత్ రెడ్డి. ఎల్బీస్టేడియంలో 9వ తేదీన సాయంత్రం 4 గంటలకు 11 వేల 63 టీచర్ల ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వబోతున్నామని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగాలకు కొత్తగా నియమితులైన 1635 మందికి శిల్పారామంలో ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు రేవంత్. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన. తెలంగాణ ఉద్యమానికి నిరుద్యోగులే ఆయువు పట్టు అని చెప్పారు. సమస్యలు పరిష్కరించి నియామక పత్రాలు ఇస్తున్నామన్నారు. నిరుద్యోగులు ఎంతోకాలం ఎదురు చూసి ప్రభుత్వాలపై విశ్వాసం కోల్పోయారన్నారు. నిరుద్యుగు వల్లే నేడు తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ వచ్చిందన్నారు.



## నటుడు నాగార్జున పిటిషన్‌పై కోర్టులో విచారణ

### నాగార్జున స్టేట్మెంట్ రికార్డ్ చేస్తామని తెలిపిన కోర్టు

### తదుపరి విచారణను వాయిదా వేసిన నాంపల్లి కోర్ట్

హైదరాబాద్, అక్టోబర్ 07 (తీన్మార్ న్యూస్): మంత్రి కొండా సురేఖపై సినీ నటులు అక్కినేని నాగార్జున వేసిన పిటిషన్‌పై నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. నాగార్జున తరపున వాదనలను సీనియర్ కౌన్సిల్ అశోక్ రెడ్డి వినిపించారు. నేడు పిటిషనర్ నాగార్జున స్టేట్మెంట్ రికార్డ్ చేస్తామని కోర్టు తెలిపింది. సోమవారం కోర్టుకు నాగార్జున హాజరయ్యారు. నాగార్జునతో పాటు సాక్షుల వాంగ్మూలాన్ని నమోదు చేయాలని నాగార్జున తరపున న్యాయవాది అశోక్ రెడ్డి కోరారు. తదుపరి విచారణను నాంపల్లి కోర్ట్ ఈరోజుకి వాయిదా వేసింది. ఇటీవల మాజీ మంత్రి కేటీఆర్ ను విమర్శించే క్రమంలో మంత్రి కొండా సురేఖ హీరో నాగార్జున కుటుంబంపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఇప్పటికే సినీ పరిశ్రమకు

మిగతా 2 లో



# కొత్త రేషన్ కార్డులకు మోక్షమెప్పుడు

## ఏళ్ల తరబడి రేషన్ కార్డులకై నిరీక్షణ

### ఈ నెల 2న ప్రక్రియ ప్రారంభంకానుండగా నిలిపివేత

### ఆందోళనలో అర్హులైన కుటుంబాలు

కొత్త రేషన్ కార్డుల జారీకి మోక్షం లభించడం లేదు. ఈనెల 2వ తేదీ నుంచి కొత్త దరఖాస్తులను స్వీకరిస్తామని ప్రకటించిన ప్రభుత్వం ప్రక్రియను నిలిపివేసింది. దీంతో అర్హులైన వారు ఆందోళన చెందుతున్నారు. రెండేళ్ల నుంచి రేషన్ కార్డుల కోసం నిరీక్షిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు పది నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు కొత్త కార్డులను జారీ చేయడం లేదు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథ కాలకు దూరం అవుతున్నారు.



తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 08 (తీన్మార్ న్యూస్):తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ 2018 వరకు రేషన్ కార్డులను జారీ చేసింది. 2018 డిసెంబర్లో జరిగిన ముందస్తు అసెంబ్లీ ఎన్నికల అనంతరం మళ్లీ అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ రేషన్ కార్డుల జారీ ప్రక్రియను నిలిపివేసింది. ఆ తర్వాత అనేకమంది దరఖాస్తులు చేసుకోగా, వాటిని 2022 సంవత్సరంలో పరిశీలించి, అందులో అర్హులైన వారికి కొత్త కార్డులను జారీ చేశారు. ఆ తరువాత వెబ్‌సైట్‌ను మూసివేసిన ప్రభుత్వం మళ్లీ రేషన్ కార్డులు ఇవ్వలేదు. నవంబర్‌లో జరిగిన

మిగతా 2 లో

## సుప్రీంకోర్టు క్యాంటీన్‌లో మాంసాహారంపై వివాదం

### బార్ అసోసియేషన్‌ను ఆశ్రయించిన న్యాయవాదుల బృందం



న్యూ ఢిల్లీ, అక్టోబర్ 07 (తీన్మార్ న్యూస్): నవరాత్రుల సమయంలో సుప్రీంకోర్టు క్యాంటీన్‌లో మాంసాహారాన్ని అనుమతించడంపై వివాదం మొదలైంది. క్యాంటీన్‌లో మాంసాహారాన్ని అనుమతించడాన్ని వ్యతిరేకిస్తూ న్యాయవాదుల బృందం కోర్టు బార్ అసోసియేషన్, ఇతర న్యాయ సంఘాలను ఆశ్రయించింది. దీంతో ఇప్పుడు ఈ వివాదం సుప్రీంకోర్టులో పెద్ద దుమారానికి కారణమైంది. హిందువులకు

మిగతా 2 లో



## హెచ్ఎండీఏ పరిధి చెరువులపై సర్వేకు సర్కార్ ఆదేశాలు

### ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ



## తెలంగాణ రాజకీయాల్లో మరో సంచలన పరిణామం

### తిరిగి టీడీపీలో చేరబోతున్నట్లు ప్రకటించిన తీగల కృష్ణారెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 07 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాజకీయాల్లో మరో సంచలన పరిణామం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి తిరిగి టీడీపీలో చేరబోతున్నట్లు ప్రకటించారు. సోమవారం హైదరాబాద్ లో టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుతో తీగల కృష్ణారెడ్డి, ఎమ్మెల్యేలు

మిగతా 2 లో

## మవోయిస్టు ప్రభావిత రాష్ట్రాలతో అమిత్ సమావేశం

### హాజరైన రాష్ట్రాల సీఎంలు, సీఎస్ లు, డీజీపీలు, ఉన్నతాధికారులు



న్యూ ఢిల్లీ, అక్టోబర్ 07 (తీన్మార్ న్యూస్): మవోయిస్టు ప్రభావిత రాష్ట్రాలతో కేంద్రహోంమంత్రి అమిత్ సమావేశమయ్యారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో జరుగుతోన్న ఈ సమావేశంలో తెలంగాణ, ఏపీ, బిహార్, చత్తీస్‌గఢ్, జారండ్, ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, వెస్ట్ బెంగాల్ రాష్ట్రాల సీఎంలు, సీఎస్ లు, డీజీపీలు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. తెలంగాణ నుంచి సీఎం రేవంత్ రెడ్డి, సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్ లు,ఏపీ నుంచి హోంమంత్రి అనిత పాల్గొన్నారు. మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలకు అభివృద్ధి సాయాన్ని అందిస్తున్న మరో ఐదు కేంద్ర శాఖల మంత్రులతోపాటు డిప్యూటీ నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్, కేంద్ర, రాష్ట్రాల ఉన్నతాధికారులు, కేంద్ర సాయుధ

మిగతా 2 లో




## ఆదాయంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నాలుగో స్థానం

ఆదాయంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నాలుగో స్థానం సంపాదించుకోగా ఢిల్లీ మొదటి స్థానంలో ఉంది. ప్రతి ఏడాది రైల్వేశాఖ ఆదాయం, ప్రయాణికుల పరంగా అగ్రస్థానంలో ఉన్న రైల్వే స్టేషన్ల వివరాలను వెల్లడిస్తుంది. ఈ నేపథ్యంలోనే 2023-24 సంవత్సరానికి సంబంధించి ఎక్కువ ఆదాయం పొందిన రైల్వేస్టేషన్ల లిస్టును ప్రకటించింది.

సికింద్రాబాద్, అక్టోబర్ 07 (తీన్మార్ న్యూస్): ఇందులో ఆదాయం పరంగా న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ అగ్రస్థానంలో ఉండగా పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని హౌరా రెండవ స్థానంలో ఉంది. అలాగే చెన్నైలోని ఎంజీఆర్ మూడో స్థానంలో, సికింద్రాబాద్ నాలుగో స్థానంలో ఉన్నాయి. ఇక ఢిల్లీలోని హజరత్ నిజాముద్దీన్, ముంబైలోని లోకమాన్య తిలక్ టెర్మినల్, అహ్మదాబాద్ రైల్వేస్టేషన్లు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఆదాయంలో ముందంజలో ఉన్న న్యూఢిల్లీ స్టేషన్ నుంచి 3,337 కోట్లు రాగా

మిగతా 2 లో

## డిజిటల్ హెల్త్ కార్డులకు తెలుగు ఫార్మేట్ విడుదల చేయలేదు



హైదరాబాద్, అక్టోబర్ 07 (తీన్మార్ న్యూస్): డిజిటల్ హెల్త్ కార్డుల కోసం తెలుగు దరఖాస్తుల ఫార్మేట్ ను ప్రభుత్వం విడుదల చేయలేదని పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ క్లారిటీ ఇచ్చారు. సోషల్ మీడియాలో వస్తున్న తెలుగు దరఖాస్తులకు

మిగతా 2 లో

## దేశానికి రోల్ మోడల్‌గా ఉండేలా కొత్త రెవెన్యూ చట్టం

### ట్యాంపరింగ్ చేయకుండా భూ రికార్డుల డిజిటలైజేషన్

### అధికారులకు ఐఏఎస్ హోదా

### 33 జిల్లాలకు సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులు



తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 07 (తీన్మార్ న్యూస్): ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. కొత్త రెవెన్యూ చట్టం రాకముందే దీనిపై తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసి, సామాన్యుడికి అందుబాటులో ఉండేలా

మిగతా 2 లో

## హైడ్రాపై ప్రతిపక్షాల రాద్ధాంతం

### మండిపడ్డ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్, అక్టోబర్ 07 (తీన్మార్ న్యూస్): గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, నాలాల పరిరక్షణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రాపై ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. హైడ్రా కూల్చివేతలు, మూసీ రివర్ ఫ్రంట్

మిగతా 2 లో

# కొత్త రేషన్ కార్డులకు మోక్షమెప్పుడు

**మొదటి పేజీ తరువాయి**

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే రేషన్ కార్డులు జారీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రజలకు హామీ ఇచ్చింది. ఆ మేరకు రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టింది. ఆరు గ్యారంటీ పథకాలతోపాటు కొత్త రేషన్ కార్డులను జారీ చేస్తామని ప్రకటించారు. మొదట డిసెంబర్ 9వ తేదీ నుంచి ఆరు గ్యారంటీల్లో మహాలక్ష్మి పథకంలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, చేయూత పథకంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.5 లక్షల నుంచి 10 లక్షలకు ఉచితంగా వైద్య చికిత్సలు అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలు పథకాలను అమలు చేసేందుకు డిసెంబర్ 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు నిర్వహించిన ప్రజాపాలన గ్రామ, వార్డు సభల్లో ఐదు గ్యారంటీ పథకాలు వర్తింపజేేందుకు స్వీకరించిన దరఖాస్తులతోపాటు, కొత్త రేషన్ కార్డుల కోసం కూడా అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తు ప్రక్రియలో భాగంగా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ.2,500 ఇవ్వడం, రూ. 500కే వంట గ్యాస్ పథకం, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు, తెలంగాణ ఉద్యమ కార్డులకు 250 గజాల స్థలంతో పాటు ఇళ్లు మంజూరు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా, చేయూత కింద కొత్తగా పింఛన్ మంజూరు కోసం ప్రజాపాలన దరఖాస్తు ఫారాన్ని రూపొందించారు. కోరిన విధంగా దరఖాస్తులను పూరించిన ఆశావహులు వాటిని అధికారులకు అందజేశారు. వీటితోపాటు రేషన్ కార్డులు లేనటువంటి వాళ్లు తెల్ల రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారు.

# సుప్రీంకోర్టు క్యాంటీన్‌లో మాంసాహారంపై వివాదం

**మొదటి పేజీ తరువాయి**

పవిత్రమైన నవరాత్రుల్లో, తొమ్మిది రోజుల పాటు దుర్గామాతను వివిధ రూపాల్లో కొలుస్తారు. ఈ నవరాత్రుల సమయంలో హిందువుల్లో చాలా మంది మాంసాహారాన్ని తినరు. అయితే, నవరాత్రి ఉత్సవాల సమయంలో మాంసాహారాన్ని పున:ప్రారంభించాలనే నిర్ణయంపై సీనియర్ న్యాయవాది రజత్ నాయర్ ఆందోళన వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ మరియు సుప్రీం కోర్టు అడ్వకేట్స్-ఆన్-రికార్డ్ అసోసియేషన్ కి లేఖ రాశారు. ఇతర బార్ సభ్యుల మనోభావాలను పరిగణలోకి తీసుకోకుండా, మళ్లీ నాన్ వెజ్‌ని క్యాంటిన్‌లో ప్రారంభించడాన్ని తప్పుపట్టారు. ఈ నిర్ణయం బార్ కౌన్సిల్ యొక్క బహుళవాద సంప్రదాయాల తో ఏకీభవించలేదని, ఇది అసహనం, ఒకరినొకరు గౌరవించుకోకపోవడాన్ని చూపించిందని లేఖలో పేర్కొన్నారు. నాయర్ రాసిన లేఖలో సుప్రీంకోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న 133 మంది న్యాయవాదులు సమర్థించారు.

# హెచ్‌ఎండీఏ పరిధి చెరువులపై సర్వేకు సర్కార్ ఆదేశాలు

హైదరాబాద్, అక్టోబర్ 07 (తీన్మార్ న్యూస్): తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. హెచ్‌ఎండీఏ పరిధిలో చెరువులపై సమగ్ర సర్వేకు ఆదేశించింది. ఈ మేరకు సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. గ్రేటర్ హైదరాబాద్‌లోని చెరువుల విస్తీర్ణంతో పాటు ఎఫ్టీఎల్, బఫర్ జోన్లను గుర్తించాలని నిర్ణయం తీసుకుంది. మూడు నెలల్లోనే సర్వే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అంతేకాదు సర్వే పూర్తయిన వెంటనే అధికారిక వెబ్‌సైట్‌లో చెరువుల వివరాలు పొందుపర్చాలని సూచించింది. కాగా, ఇప్పటికే నగరంలోని చెరువులను పరిరక్షించేందుకు ప్రభుత్వం హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీకి) అనే కొత్త వ్యవస్థను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. హైడ్రాకు మరింత బలాన్ని చేకూర్చేందుకు వీలుగా బల్దియా చట్టంలో కొత్త సెక్షన్ చేర్చుతూ ఇటీవలే ఆర్డినెన్స్ సైతం జారీ అయింది. దీనికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలపగా రాజ్‌భవన్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇక నుంచి జీహెచ్‌ఎంసీ పరిధిలో ప్రభుత్వ ఆస్తుల సంరక్షణే లక్ష్యంగా ఆక్రమణదారులకు నోటీసులివ్వడం, విచారణ చేపట్టడం, అక్రమ నిర్మాణాలను కూల్చివేయడం వంటి అధికారాలతో హైడ్రా దూసుకెళ్లనుంది. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర సర్వేకు ఆదేశించడం రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# నటుడు నాగార్జున పిటిషన్ పై కోర్ట్ లో విచారణ

**మొదటి పేజీ తరువాయి**



చెందిన ప్రముఖులంతా కొండా సురేఖ వ్యాఖ్యలను ఖండించారు. ఇప్పటికే కేటీఆర్ లీగల్ నోటీసులు పంపగా హీరో నాగార్జున నాంపల్లి కోర్టులో పరువు నష్టం దావా వేశారు. తమ కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్టను దెబ్బతీసేలా మంత్రి సురేఖ వ్యాఖ్యలు చేశారంటూ నాగార్జున కోర్టును ఆశ్రయించారు. మంత్రి సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ వ్యాజ్యంపై కోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తిగా మారింది.

# మవోయిస్టు ప్రభావిత రాష్ట్రాలతో అమిత్ సమావేశం

**మొదటి పేజీ తరువాయి**

బలగాలకు చెందిన సీనియర్ ఆఫీసర్లు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. 2026నాటికి మావోయిస్టు సమస్యను రూపుమాపడమే లక్ష్యంగా చర్చలు జరగనున్నాయి. త్వరలోనే మావోయిస్టు సమస్య నుంచి దేశానికి విముక్తి కల్పిస్తామని ఇప్పటికే ప్రకటించారు కేంద్రహోంమంత్రి అమిత్ షా. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి సోమవారం కాంగ్రెస్ హైకమాండ్ పెద్దలతో కూడా భేటీ కానున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులు, మంత్రి కొండా సురేఖ కామెంట్స్, హైడ్రాకు ఫుల్ పవర్స్ ఇస్తూ ఆర్డినెన్స్, మూసీ రివర్ డెవలప్మెంట్, ఇతర రాజకీయ అంశాలను హైకమాండ్ కు సీఎం వివరించనున్నారని సమాచారం.

# దేశానికి రోల్ మోడల్‌గా ఉండేలా కొత్త రెవెన్యూ చట్టం

**మొదటి పేజీ తరువాయి**

సేవలను తీసుకురాబోతున్నట్టు చెప్పారు. 33 జిల్లాల్లో సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులను క్రియేట్ చేయనున్నట్టు తెలిపారు. అలాగే, 17 మంది రెవెన్యూ అధికారులకు ఐఏఎస్ హోదా కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల సమయంలో బదిలీ అయిన తహసీల్దార్లను పూర్వస్థానాలకు ట్రాన్స్‌ఫర్ చేసేవిషయంపై దసరాలోపే నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, ఎవరూ రెవెన్యూ శాఖ మంత్రిగా ఉన్నా, ఎవరూ కూడా ప్రభుత్వ భూముల రికార్డులను ట్యాంపరింగ్ చేయకుండా ఉండేలా యుద్ధప్రాతిపదికన డిజిటలైజేషన్ చేపడుతామని తెలిపారు. ఇటీవలే హైదరాబాద్‌లోని ఎంసీహెచ్‌ఆర్డీలో 272 మంది స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కొత్తగా ఉద్యోగంలో చేరినవారితో పాటు సర్వీస్ లో ఉన్న ప్రతి ఒక్కరికీ శిక్షణ తప్పనిసరి చేస్తామని తెలిపారు. రెవెన్యూ విభాగం ఉద్యోగులకు సంబంధించి జాబ్ చార్ట్ రూపొందించాలని, ఇందుకోసం ఒక కమిటీని ఏర్పాటు చేసి, ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేయాలని సూచించారు. దేశానికి రోల్ మోడల్ గా ఉండేలా కొత్త రెవెన్యూ చట్టం2024ను తీసుకురాబోతున్నామని తెలిపారు. నల్గొండ జిల్లా తిరుమలగిరి, రంగారెడ్డి జిల్లా యాచారం మండలాల్లో పైలెట్ ప్రాజెక్ట్ ను నిర్వహిస్తున్నామని. అక్కడ ఎదురయ్యే సమస్యలు, మంచి చెడులను పరిగణనలోకి తీసుకుని చట్టాన్ని రూపొందిస్తున్నామని తెలిపారు. తిరుమలగిరి మండలంలో పర్యటించి, రైతులతో మాట్లాడానని చెప్పారు. ఈ ఒక్క మండలంలోనే 4,380 ఎకరాల్లో సర్వే నిర్వహిస్తే 1,300 ఎకరాలు మోఖా మీద లేని వారికి పాసుబుక్కులు ఉన్నాయనే విషయం బయటపడిందన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఏ మాత్రం రాజీపడొద్దని అధికారులకు మంత్రి పొంగులేటి సూచించారు. ప్రతి 3 నెలలకోసారి రాష్ట్ర, జిల్లాస్థాయిలో కోర్టుకు సంబంధించిన భూముల విషయంలో లీగల్ టీంతో సమావేశం నిర్వహిస్తామని చెప్పారు.

**200 మండలాల్లో సొంత భవనాలు లేవు.**

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు వీలైనంత ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా రెవెన్యూ యంత్రాంగం చాలా బాగా పనిచేసిందని మంత్రి పొంగులేటి అభినందించారు. ఉద్యోగుల సమస్యలకు సంబంధించి ఆర్థికేతర అంశాలను తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగులు చెప్పినట్టుగా యునిఫార్మ్ గా అందరికీ ఒకేరకమైన వాహనాలు ఉండాలన్న ఆలోచన మంచిదని, అయితే, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం మండలాలు, రెవెన్యూ డివిజన్లు, జిల్లాలను పెంచింది కానీ అక్కడ మౌలిక సదుపాయాలను విస్మరించిందని అన్నారు. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ మాట్లాడుతూ గత 9 నెలల్లో రెవెన్యూ శాఖ మంత్రి ఆధ్వర్యంలో ప్రజలకు అనువైనవిధంగా సంస్కరణలు చేపట్టామని తెలిపారు.

# వస్తున్నారు... వర్సిటీలకు వీసీలు!

## విశ్వవిద్యాలయాల మనుగడ ఎలా ఉండబోతుంది



విశ్వవిద్యాలయాలు, సమాజంలో అత్యంత ప్రధానమైన విద్యా సంస్థలు, భవిష్యత్తు తరాలకి బలమైన పునాది కట్టడానికి విశేషంగా దోహదపడతాయి. ప్రపంచవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు విద్యార్థులకి అత్యున్నత స్థాయి విద్యను అందించే కేంద్రాలుగా ఉన్నాయి. విద్యా వ్యవస్థ మెరుగుపడాలంటే, వాటిని నడిపించేందుకు ఉన్నతమైన ప్రతిభావంతులైన నాయకత్వం అవసరం. అయితే, కొన్నిసార్లు రాజకీయాలకు సంబంధం ఉన్న వారిని లేదా కులం ఆధారంగా ఎంపిక చేసిన వారిని ఉపకులపతులుగా నియమించడం జరుగుతోంది. ఈ పరిస్థితి భవిష్యత్తులో విద్యావ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుంది. విశ్వవిద్యాలయాల మూల స్తంభంగా ఉన్న ఉపకులపతులు విద్య, పరిశోధన, పరిపాలన మొదలైన విషయాల్లో నైపుణ్యం కలిగి ఉండాలి. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయ ఉపకులపతుల నియామకానికి సంబంధించిన ప్రక్రియ వేగవంతమైంది. తెలంగాణ ప్రభుత్వం దసరా పండుగ లోపు అన్ని విశ్వవిద్యాలయాలకు ఉపకులపతులను మరియు హయ్యర్ ఎడ్యుకేషన్ కు చైర్మన్ మరియు వైస్ చైర్మన్ లను నియమించి విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలని కోరుకుంటుంది. తెలంగాణ రాష్ట్రంలో విశ్వవిద్యాలయాల్లో గత పది సంవత్సరాల నుంచి ఎటువంటి రిక్రూట్మెంట్స్ లేకపోవడం వలన బోధన, పరిశోధన మెరుగైన ఫలితాలను ఇవ్వడం లేదు.గత ప్రభుత్వం ఉన్నత విద్యను దిగజార్చిందని, విద్యా కమిషన్ చైర్మన్ గా ఆకునూరి మురళి నియమించి విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని ఆశిస్తుంది ప్రస్తుత ప్రభుత్వం.

ఉపకులపతిగా ఉన్న వ్యక్తి ఆలోచనా శక్తి, వినూత్నత, మరియు వ్యూహాత్మక దృష్టి కలిగి ఉండాలి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, కొత్త అధ్యయన పద్ధతులు, పరిశోధన విధానాలు మొదలైన వాటిని సమర్థవంతంగా అమలు చేయగలిగే సామర్థ్యం ఉండాలి. అదేవిధంగా వర్సిటీలు నిధుల లేమితో ఇబ్బంది పడుతున్న క్రమంలో నూతన వీసీలు బ్లాక్ గ్రాంట్ పెంచి విద్యార్థులకు నాణ్యమైన బోధన, భోజన సౌకర్యం కల్పించాలి.

పరిశోధన రంగంలో అభివృద్ధి చేసేందుకు ఉపకులపతులు పెద్ద పీట వేయాలి. కొత్త కొత్త ప్రాజెక్టులను చేపట్టడం, పరిశోధన నిధుల లభ్యతని మెరుగుపరచడం, అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామ్యం చేయడం వంటి చర్యలు చేపట్టాలి. ఉపకులపతులు స్వయంగా ప్రముఖ విద్యావేత్తలు, పరిశోధకులుగా ఉండాలి. తమ రంగంలో విశేష కృషి చేసి ఉన్నతమైన రికార్డు కలిగిన వారిని ఎంపిక చేయాలి. ఈ విధంగా, వారు విద్యార్థులకు, అధ్యాపకులకు మార్గదర్శకులుగా నిలుస్తారు. నైతిక విలువలతో నడుచుకునే వ్యక్తిగా ఉండడం అవసరం. పరిపాలనలో పారదర్శకత పాటించడం, ప్రతి స్థాయిలో సమానత్వాన్ని, సమర్థతను నిర్ధారించడం వంటి లక్షణాలు ఉండాలి.

విద్యార్థుల విద్యాప్రక్రియ, పరిశోధన రంగం, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలను పట్టించుకొని, వారికి అవసరమైన వనరులు అందించడం వంటి కృషి చేయాలి. విద్యార్థులకు ఉత్సాహం, ప్రేరణ ఇవ్వగలిగే విధంగా ఉండాలి. డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా ఉన్న సమకాలీన విద్యా వ్యవస్థకు అనుగుణంగా ఉపకులపతులు సాంకేతిక పరిజ్ఞానం పై అవగాహన కలిగి ఉండాలి. ఆన్లైన్ టీచింగ్, మూడీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వంటి సాంకేతిక విధానాలను ఎప్పటికప్పుడు సమర్థవంతంగా అమలు చేయాలి. వివిధ సామాజిక, ఆర్థిక మరియు సాంస్కృతిక నేపథ్యాల నుంచి వచ్చే విద్యార్థులకు, అధ్యాపకులకు సమగ్ర విధానాలు ఉండాలని చూస్తూ, వారిని సమానంగా ఎదగడానికి సహకరించాలి.

రాజకీయ సంబంధం ఉన్నవారిని ఉపకులపతులుగా నియమించడం వల్ల, విశ్వవిద్యాలయాలు రాజకీయ ప్రభావం ఎక్కువగా ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ ప్రభావం వల్ల, అధ్యాపకులు మరియు విద్యార్థులు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించలేరు. విద్యా విధానాలు కూడా రాజకీయ అవసరాల ప్రకారం మారుతాయి, విద్యార్థులకు అసలు అవసరమైన జ్ఞానం మరియు నైపుణ్యం అందకుండా ఉండే అవకాశం ఉంది. నాణ్యతతో కూడిన విద్య అందించగలగాలంటే, ఉపకులపతులు విద్యా రంగంలో విశేష అనుభవం మరియు పరిశోధన నైపుణ్యాలు కలిగి ఉండాలి. వారు విద్యా విధానాల్లో అవగాహన కలిగి, విద్యార్థుల అభ్యాస పద్ధతులు, పరిశోధనలో నూతన విధానాలను ప్రవేశపెట్టగలరు. రాజకీయ అడ్డంకులు లేకుండా, విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తు కల్పించడానికి కృషి చేయగలరు. ప్రస్తుతం జరుగుతున్న విధంగా కులం లేదా రాజకీయ ఆధారంగా ఉపకులపతుల నియామకం జరుగుతుంటే, భవిష్యత్ తరాలపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. విశ్వవిద్యాలయాలు విద్యా మరియు పరిశోధన రంగాల్లో ప్రపంచ స్థాయిలో నిలవాలంటే, నైపుణ్యం కలిగిన, సమర్థవంతమైన వ్యక్తులను ఎంపిక చేయడం అత్యంత ముఖ్యం. కేవలం అర్హతలు, ప్రతిభ, మరియు నైతిక విలువల ఆధారంగా ఉపకులపతులను నియమించడం ద్వారా మాత్రమే మెరుగైన భవిష్యత్తుకు పునాది వేయగలుగుతాం.

- డా. టీ. నాగయ్య, డిపార్ట్మెంట్ అఫ్ మాథమాటిక్స్,
కాకతీయ యూనివర్సిటీ , 9701275354

# రవాణా శాఖల అధికారులతో ఆర్టీసీ సమన్వయ సమావేశం

**ఈ నెల 13, 14 తేదీల్లో ప్రత్యేక బస్సుల ఏర్పాటుకు సిద్ధం**

**సమాచారం కోసం స్పెషల్ కాల్ సెంటర్ల నెంబర్లు కేటాయింపు**



హైదరాబాద్, అక్టోబర్ 07 (తీన్మార్ న్యూస్): దసరా ఆపరేషన్స్‌పై పోలీస్, రవాణా శాఖల అధికారులతో ఆర్టీసీ సమన్వయ సమావేశం నిర్వహించారు. సద్దుల బతుకమ్మ, దసరా పండుగలకు ప్రయాణికులను క్షేమంగా సొంతూళ్లకు చేర్చేందుకు టీజీఎస్‌ఆర్టీసీకి సహకరించాలని పోలీస్, రవాణా శాఖల అధికారులను సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ కోరారు. గత దసరాతో పోల్చితే ఈ సారి మహాలక్ష్మి పథకం అమలు వల్ల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశముందని, గతంలో మాదిరిగానే సహాయ-సహకారాలు అందించాలని ఆయన కోరారు. దసరా ఆపరేషన్స్‌పై హైదరాబాద్ లోని బస్ భవన్ లో సోమవారం టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ అధ్యక్షతన పోలీస్, రవాణా శాఖ అధికారులతో సమన్వయ సమావేశం జరిగింది. దసరాకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులు, రద్దీ ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యల గురించి వారికి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఆర్టీసీ అధికారులు వివరించారు. పండుగ సమయాల్లో ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు టీజీఎస్‌ఆర్టీసీకి పోలీస్, రవాణా శాఖలు ఎంతగానో సహకరిస్తున్నా యని గుర్తు చేశారు. సంస్థ వృద్ధిలో పోలీస్, రవాణా శాఖల పాత్ర కూడా ఉందని అన్నారు. పండుగలకు రద్దీ ఎక్కువగా ఉందని వైట్ నంబర్ ప్లేట్ గల ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించి ఇబ్బందులు పడొద్దని ప్రజలకు సూచించారు. టీజీఎస్‌ఆర్టీసీలో ఎంతో అనుభవం గల డ్రైవర్లు ఉన్నారని, వారు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేస్తారని చెప్పారు. ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణిస్తే తలెత్తే ప్రమాదాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఐటీ కారిడార్ ఉద్యోగుల సౌకర్యార్థం గచ్చిబౌలి ఓఆర్ఆర్ మీదుగా విజయవాడ, బెంగళూరు, తదితర ప్రాంతాలకు బస్సులను నడిపేలా ప్లాన్ చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా జేబీఎస్ నుంచి 1602, ఎల్బీనగర్ నుంచి 1193, ఉప్పల్ నుంచి 585, ఆరాంఘర్ నుంచి 451 అదనపు బస్సులను నడుపుతున్నట్లు పేర్కొన్నారు. తిరుగు ప్రయాణం రద్దీ ఎక్కువగా ఉండే ఈ నెల 13, 14 వ తేదిల్లోనూ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. బతుకమ్మ, దసరా ప్రత్యేక సర్వీసుల్లో ముందస్తు రిజర్వేషన్ ను సంస్థ అధికారిక వెబ్ సైట్ tgsrtcbus.in లో చేసుకోవాలని కోరారు. దసరా స్పెషల్ సర్వీసులకు సంబంధించి పూర్తి సమాచారం కోసం టీఎస్‌ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033ను సంప్రదించాలని సూచించారు. ప్రయాణికులు సమయాన్ని వృథా చేసుకోకుండా బస్సుల కదలికలను గుర్తించేందకు గమ్యం ట్రాకింగ్ యాప్ ను వినియోగించు కోవాలన్నారు. హైదరాబాద్ సిటీ అదనపు కమిషనర్ (ట్రాఫిక్) విశ్వప్రసాద్ మాట్లాడుతూ పండుగ వేళల్లో టీజీఎస్‌ఆర్టీసీకి తమ సహకారం ఎప్పటికీ ఉంటుందని అన్నారు. ప్రయాణికులను క్షేమంగా సొంతూళ్లకు చేర్చడానికి టీజీఎస్‌ఆర్టీసీతో సమన్వయంగా పని చేస్తామని చెప్పారు.

# తెలంగాణ రాజకీయాల్లో మరో సంచలన పరిణామం

**మొదటి పేజీ తరువాయి**

మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన తీగల తాను నూటికి నూరు శాతం టీడీపీలో చేరబోతున్నట్లు స్పష్టం చేశారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభం తీసుకువచ్చేందుకు చంద్రబాబును కలిశామని చెప్పారు. మరోసారి పిలిచి మాతో మాట్లాడుతానని చంద్రబాబు చెప్పారన్నారు. నాతో పాటు చాలా మంది నాయకులు టీడీపీలో చేరుతారని ప్రకటించారు. టీడీపీ వల్లే హైదరాబాద్ అభివృద్ధి చెందిందని, రాష్ట్రంలో చాలా మంది ఎన్టీఆర్, టీడీపీ అభిమానులు ఉన్నారని వారందరిని ఏకతాటిపైకి తీసుకువస్తామన్నారు. దీంతో తీగల బాటలో ఎవరెరు టీడీపీ గూటికి చేరబోతున్నారనేది సర్వత్రా సస్పెన్స్ గా మారింది.

**మల్లారెడ్డిపై ఊహాగానాలు:**

నిజానికి గత కొంత కాలంగా మల్లారెడ్డి టీడీపీలో చేరుతానే ఊహాగానాలు జోరుగా వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారం కోల్పోయాక మల్లారెడ్డి కాంగ్రెస్ లో చేరేందుకు ప్రయత్నాలు చేశారని ఇందులో భాగంగానే గతంలో కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ను సైతం కలిశారనే ప్రచారం జరిగింది. ఇక బీజేపీతోనూ మంతనాలు జరిపినా ఆ పార్టీ నుంచి రూట్ క్లియర్ కాకపోవడంతో ఆయన ఆగిపోయారనే టాక్ వినిపించింది. ఈ నేపథ్యంలో ఏపీలో చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం, తాను గతంలో టీడీపీ నుంచే ఎంపీగా గెలవడంతో చంద్రబాబుతో ఉన్న పరిచయం కారణంగా ఆయన పార్టీలో చేరేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు ప్రచారం చాలా రోజులుగా జరుగుతోంది. ఈ వాదనకు బలం చేకూరేలా సోమవారం తన అల్లుడితో పాటు చంద్రబాబుతో భేటీ కావడం, మల్లారెడ్డి సమక్షంలోనే తీగల తాను పార్టీ మారబోతున్నట్లు ప్రకటించడం సంచలనంగా మారింది. అయితే మూడు రోజుల క్రితమే మల్లారెడ్డి బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ తో భేటీ అయ్యారు. తాజాగా తన అల్లుడితో కలిసి టీడీపీ అధినేతను కలిసి తన మనవరాలి వివాహానికి ఆహ్వానించారు. ఈ క్రమంలోనే తాను వెడ్డింగ్ కార్డు ఇచ్చేందుకే చంద్రబాబుతో భేటీ అయ్యానని మల్లారెడ్డి క్లారిటీ ఇచ్చారు. అయితే రాష్ట్రంలో ఉన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఇంట్లో జరగబోయే శుభకార్యం అనంతరం మల్లారెడ్డి రాజకీయంగా ఏదైనా సంచలన నిర్ణయం తీసుకోబోతున్నారా? అనేది పొలిటికల్ కారిడార్ లో చర్చగా మారింది.

**స్థానిక ఎన్నికల వేళ సంచలన పరిణామం:**

గత కొంత కాలంగా తెలంగాణ రాజకీయాల్లో ట్రయాంగిల్ ఫైట్ నడుస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీలు నువ్వా నేనా అన్నట్లుగా వ్యూహాలు రచిస్తున్నాయి. ఈ క్రమంలో తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ పోటీ చేయబోతున్నదని ఇందుకు శ్రేణులంతా సిద్ధంగా ఉండాలని గత జూన్ లోనే పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు క్లారిటీ ఇచ్చారు. తెలంగాణలోని పార్టీ నేతలతో సమావేశమైన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే టీ టీడీపీకి అధ్యక్షుడిని నియమిస్తానని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ నేపథ్యంలో పలువురు కీలక నేతలు టీడీపీ వైపు చూస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇంతలో గత కొంత కాలంగా బీఆర్‌ఎస్ లో అసంతృప్త రాగం ఆలపిస్తున్న తీగల కృష్ణారెడ్డి తాను టీడీపీలో చేరుతానని ప్రకటించడం, మల్లారెడ్డి వంటి నేతలు సైతం పార్టీ మారుతారనే ప్రచారం జరుగుతుండటంతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల వేళ తెలంగాణ రాజకీయాల్లో అనేక సంచలనాలు నమోదు కాబోతున్నాయనే చర్చ జోరందుకుంది.

# ఆదాయంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నాలుగో స్థానం

**మొదటి పేజీ తరువాయి**

హైరా స్టేషన్ నుంచి 1,692 కోట్లు వచ్చింది. అలాగే చైన్నై సెంట్రల్ నుంచి 1,299 కోట్లు, సికింద్రాబాద్ నుంచి 1,276 కోట్ల ఆదాయం సమకూరింది. 500 కోట్ల కంటే ఎక్కువ ఉన్న రైల్వేస్టేషన్లు 28 ఉన్నాయి. వీటిని నాన్ సబర్బన్ గ్రూప్-1 కేటగిరీలో చేర్చారు. ఇక ప్రయాణికుల పరంగా ముంబైలోని థానే రైల్వే స్టేషన్ నుంచి అత్యధికంగా 93.06 కోట్ల మంది ప్రయాణించారు. దీని తర్వాత ముంబైలోని కల్యాణ్ రైల్వేస్టేషన్ రెండో స్థానం దక్కించుకుంది. దీని నుంచి ఈ ఏడాది 83.79 కోట్ల మంది ప్రయాణించారు. ఈ రైల్వే స్టేషన్లలో ఆధునిక సౌకర్యాలు కల్పించేందుకు కేంద్రం మరిన్ని నిధులు కేటాయించనుందని రైల్వే అధికారి వెల్లడించారు.

# హైడ్రాపై ప్రతిపక్షాల రాద్ధాంతం

**మొదటి పేజీ తరువాయి**

ప్రాజెక్ట్‌పై సచివాలయంలో సోమవారం భట్టి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు నిరాధార ఆరోపణలు చేస్తున్నాయని తప్పుడు ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని సీరియస్ అయ్యారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోన్న మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్‌పై తప్పుడు ప్రచారంతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ విషయంలో కాంగ్రెస్ నేతలకు వ్యక్తిగత అజెండా లేదని ప్రజలకు మేలు చేయాలనే ఆలోచన మాత్రమే ప్రభుత్వానికి ఉందని భట్టి స్పష్టం చేశారు. హైదరాబాద్ అంటేనే లేక్స్, రాక్స్, పార్క్స్ అన్నారు. కానీ గడిచిన కొన్ని సంవత్సరాల నుండి నగరంలో రాక్స్, పార్కులు కబ్జాలకు గురయ్యాయని ఇక మిగిలిన లేక్స్ కూడా కబ్జాలకు గురి కావొద్దనే మా ప్రభుత్వ ఆలోచన అని హైడ్రా కూల్చివేతలపై క్లారిటీ ఇచ్చారు. హైదరాబాద్ మహానగరాన్ని భవిష్యత్ తరాలకు అందించాలనేదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇది ప్రజా ప్రభుత్వం పారదర్శక ప్రభుత్వమని పేర్కొన్నారు.

# పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ క్లారిటీ

**మొదటి పేజీ తరువాయి**

ప్రభుత్వానికి సంబంధం లేదని ఆయన తెలిపారు. ఈ మేరకు కమిషనర్ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఫ్యామిలీ డిజిటల్ హెల్త్ కార్డు డిజైన్ ఇప్పటి వరకు ఫైనల్ కాలేదని స్పష్టం చేసింది. సోషల్ మీడియా, పలు మాధ్యమాల్లో వస్తున్న వార్తలపై ప్రభుత్వంతో సంబంధ లేదని తేల్చి చెప్పింది. ఫేక్ దరఖాస్తులపై వస్తున్న వార్తలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అలాంటి తప్పుడు వార్తలపై ప్రజలు స్పందించవద్దని పేర్కొంది. ఇలాంటి ఫేక్ వార్తలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# జైళ్లలో కులవివక్ష

మనుషుల్ని రంగు, రూపు, కులం, మతం ఆధారంగా విభజించి చూసే వివక్షాపూరిత విధానాలు సమాజంలో ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. మహాత్మా గాంధీ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జ్యోతిబా పూలే వంటి మహనీయులు కుల, మత వివక్ష నిర్మూలన కోసం ఇతోధికంగా పాటుపడ్డారు. సమాజ ప్రగతికి ఈ వివక్షాపూరిత విధానాలు భంగకరమంటూ ఎలుగెత్తి చాటారు. కానీ, వారి శిష్యులమని చెప్పుకుంటూ, ఆ మహానుభావుల జయంతులు, వర్ధంతులకు సభలు సమావేశాలను ఘనంగా నిర్వహించి చేతులు దులుపుకునే వారే నేటి సమాజంలో ఎక్కువయ్యారు తప్ప వారి ఆశయాలను ఆచరణలో పెట్టేవారిని వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు. కులం, మతం, జాతి, లింగం లేదా పుట్టిన ప్రదేశం వంటి వాటి ఆధారంగా వివక్ష చూపడం నేరమంటూ రాజ్యాంగంలోనూ మనం పొందుపరచుకున్నా, ఆచరణలో మాత్రం అమలుకు నోచుకోవడం లేదనడానికి సాక్ష్యాలు కావలసినన్ని. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు దాటినా ఇప్పటికీ కులవివక్ష నిక్షేపంలా వర్ధిల్లుతోందనడానికి ప్రభుత్వ ఏలుబడిలో నడిచే జైళ్లను ఉదాహరణగా చెప్పుకోవచ్చు. తప్పు చేసినవారిని నిర్బంధించి, వాళ్లలో సత్ప్రవర్తన కలిగించేందుకు ఉద్దేశించిన జైళ్లే కులవివక్షకు కొమ్ము కాస్తున్నాయన్న నగ్నసత్యం తాజాగా సర్వోన్నత న్యాయస్థానం విచారణలో వెల్లడి కావడం విస్తుగొలుపుతోంది. మహారాష్ట్రకు చెందిన సుకన్య శాంత అనే ఓ పాత్రికేయురాలు జైళ్లలో ఇప్పటికీ కులవివక్ష నిరాఘాటంగా కొనసాగుతోందంటూ దాఖలు చేసిన పిటిషన్ ఆధారంగా తీగ లాగితే డొంక కదిలినట్లు లోపభూయిష్టమైన జైలు మాన్యువళ్లు, అధికారుల కుల దురహంకారం వంటి అరాచకాలన్నీ వెలుగులోకి వచ్చాయి. జైళ్లలో ఊడ్చడం, మురుగు ట్యాంకులు శుభ్రం చేయడం వంటి పనులను ఇప్పటికీ కులం ఆధారంగానే అప్పగిస్తున్నట్లు వెల్లడైంది. వంట చేయడం వంటి పనులను అగ్రవర్ణాలకు కేటాయిస్తున్నారు. అంతేకాదు, ఖైదీలకు గదులు కేటాయించే విషయంలోనూ కులమే అర్హతగా మారడం విచారించదగిన విషయం. కులం ఆధారంగా పని విభజన చేయడం సమానత్వానికి వ్యతిరేకమంటూ చీవాట్లు పెట్టిన సుప్రీం కోర్టు, దీనిపై వివరణ ఇవ్వాలంటూ 11 రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేస్తూ, పని విషయంలో అందరికీ సమాన హక్కు కల్పించాల్సిందేనంటూ తేల్చి చెప్పింది. సమాజంలోని అన్ని రంగాలలోనూ కులమత వివక్షను నిర్మూలించి ఏళ్లు గడుస్తున్నా, జైలు మాన్యువల్స్‌లోనే ఇలాంటి వివక్షాపూరిత నిబంధనలు ఉన్నట్లు గుర్తించిన సర్వోన్నత న్యాయస్థానం.. వెంటనే మోడల్ ప్రిజన్ మాడ్యూల్ 2016, మోడల్ ప్రిజన్స్, కరెక్షనల్ సర్వీసెస్ చట్టం 2023ను మార్చాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. జైళ్లు అక్రమాలకు ఆలవాలంగా మారాయంటూ పౌరహక్కుల సంఘాలు, ప్రజాస్వామికవాదులు ఎంతో కాలంగా అరచి గీ పెడుతున్నారు. కులమత వివక్ష మాత్రమే కాకుండా ఖైదీలకు సౌకర్యాలు సమకూర్చడంలో డబ్బు ప్రధాన పాత్ర వహిస్తోందని అడపాదడపా వెలుగు చూస్తున్న సంఘటనలు తేటతెల్లం చేస్తూనే ఉన్నాయి. డబ్బు గల ఖైదీలకు బయట నుంచి భోజనం సమకూర్చడం, సెల్ ఫోన్లు అందించడం వంటివి జైళ్లలో నిర్నిరోధంగా సాగిపోతూ ఉంటాయి. ఉన్నతాధికారుల తనిఖీల్లో ఇలాంటి అక్రమాలు బయటపడి, సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకున్నా, మళ్లీ షరా మామూలే. జైలు నాలుగు గోడల మధ్య ఏం జరుగుతోందో సమాజానికి తెలిసే వీలు అంతగా లేని కారణంగా, కొందరు పోలీసు అధికారులు జైళ్లలో ఇష్టారాజ్యంగా చెలరేగిపోతూ ఉంటారు. ఖైదీల పట్ల నిరంకుశంగా ప్రవర్తిస్తూ వారి ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తూంటారు. కానీ జైలు మాన్యువళ్లలోనే కుల వివక్షను ప్రోత్సహించే విధంగా నియమ నిబంధనలకు రూపకల్పన చేయడం సహించరాని విషయం. ఉదాహరణకు జైళ్లలో శుభ్రం చేసే పనులను మెహతర్ లేదా చందాల్ కులానికి చెందినవారే చేయాలని పశ్చిమ బెంగాల్ జైలు మాన్యువల్ చెబుతోంది. కాస్త అటూ ఇటూగా ఇలాంటి నిబంధనలే కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, ఒడిశా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలోనూ ఉండటం గమనార్హం. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఆయా రాష్ట్రాలు మూడు నెలలలోగా మాన్యువళ్లను అప్‌డేట్ చేసి, ఖైదీల ప్రాథమిక హక్కుల పరిరక్షణకు పెద్దపీట వేయడం అత్యంత ఆవశ్యకం. పరివర్తన అనేది ఖైదీలకే కాదు, వారి పట్ల అమానుషంగా ప్రవర్తించే పోలీసు ఉన్నతాధికారులకూ వర్తిస్తుంది. ఖైదీల చేత వెట్టి చాకిరీ చేయిస్తూ, వీలైనప్పుడలా వారిని హింసిస్తూ పైశాచికానందం పొందే జైలు సిబ్బందిలోనూ పరివర్తన కలిగేలా మాన్యువళ్లు రూపుదిద్దుకుంటే, జైళ్లు మానవతాలోగిళ్లుగా మారతాయనడంలో సందేహం లేదు.

# నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



వనపర్తి నియోజకవర్గం, అక్టోబర్ 07 (తీన్మార్ న్యూస్): పెద్దమందడి మండలం ముందరితండా గ్రామ పంచాయతీలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని సోమవారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రారంభించారూ. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన ఆయనకు తండావాసులు బతుకమ్మతో డీజే శబ్దాల మధ్య సాంప్రదాయ నృత్యాలు చేస్తూ ఘనంగా స్వాగతం పలికారు. తండాలోని ప్రధాన కూడలి నుంచి గ్రామపంచాయతీ వరకు ఊరేగింపు చేపట్టారు. అనంతరం నూతన గ్రామపంచాయతీ భవనంతో పాటు సీసీటీవీ కెమెరాలను వలయాధికారి (%ఎఱ%) రాంబాబు పెద్దమందడి, ఖిల్లా ఘణపురం ఎస్సై లతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మొదటినుంచి తనతో పాటు రాజకీయంగా ప్రయాణం చేసి తాను ఎమ్మెల్యేగా గెలుపొందేందుకు పూర్తి స్థాయిలో సహకరించిన ముందరి తండా గ్రామ అభివృద్ధికి ఎల్లవేళలా సహకరిస్తానని ఎమ్మెల్యే తండా వాసులకు హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు పింఛన్లు రాయితీ సిలిండర్లు ఉచిత విద్యుత్ తో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్ గ్రామ మాజీ సర్పంచ్ జయంతి శంకర్, చీకరు చెట్టు తండా గ్రామ మాజీ సర్పంచ్ రాధాకృష్ణ, మాజీ జెడ్పిటిసి సభ్యులు కొమ్ము వెంకటస్వామి రమేష్ గౌడ్, మణిగిళ్ల తిరుపతిరెడ్డి, గట్టు యాదవ్, సుదర్శన్ రెడ్డి, జయపాల్ రెడ్డి, సక్రు నాయక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం కమిషనర్లను నియమించాలి

- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు వినతి పత్రం ఇచ్చిన ఆర్టిఐ కమిటీ



పాలకవీడు, సెప్టెంబర్ 07 (తీన్మార్ న్యూస్): సోమవారం హైదరాబాద్ లోని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కార్యాలయంలో సమాచార హక్కు చట్టం కమిషనర్లను నియమించాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు ఆర్టిఐ కమిటీ సభ్యులు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం సెక్షన్ 3 ప్రకారం దేశ పౌరులందరూ సమాచారం పొందే హక్కు ఉందన్నారు. సెక్షన్ 6(1) ప్రకారం సమాచారం కోసం వివిధ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోగా, 30రోజుల్లోగా ఇవ్వవలసిన సమాచారాన్ని కొన్ని నెలలు గడిచినా ఇవ్వడం లేదని ఆయన అన్నారు. సెక్షన్ 19 (1) ప్రకారం మొదటి అప్పీల్ సమాచారం ఇవ్వట్లేదనీ, అలాగే సెక్షన్ 19 (3) ప్రకారం రెండవ అప్పీల్ చేస్తే స్టేట్ కమిషన్ ఆఫీస్ లో కమిషనర్లు లేక వేల దరఖాస్తులు పరిష్కారం కావడం లేదని అన్నారు. ఈ సందర్భంగా జాతీయ ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఆర్టీఐ కమిషనర్లను నియమించాలని, సమాచార హక్కు చట్టాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సూర స్రవంతి,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం,రాష్ట్ర కార్యదర్శి గుండెల రాయుడు,అక్కెళ్లి పవన్ కళ్యాణ్, అక్కెళ్లి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సమస్యలపై కలెక్టర్ కి ఫిర్యాదు

**కంటెస్టేడ్ ఎమ్మెల్యే దయానంద్ ముదిరాజ్**



వనపర్తి నియోజకవర్గ, అక్టోబర్ 07 (తీన్మార్ న్యూస్): వనపర్తి పట్ట%ఖు%లో ఉన్న ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మరియు నర్సింగాయ పల్లి ప్రభుత్వ ఆసుపత్రిలోని సమస్య పై వనపర్తి నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే దయానంద్ ముదిరాజ్. సోమవారం జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేశారు.
ప్రభుత్వ ఆసుపత్రిలో పేద ప్రజలతో డబ్బులు వసూల్ చేసే వారిని విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని గుర్తించి చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ హాస్పిటల్ లో ఎలాంటి నగదు వసూలు కార్యమాలు జరగట్లేదు స్వయంగా మేమే పర్యవేక్షిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అలాంటి ఘటనలు జరిగిన మా ద్రుష్టి కి వచ్చిన శాఖ పరమైన చర్యలు చెప్పడతామని. ప్రభుత్వ హాస్పిటల్ లో రోగులతో కేర్ టెకర్స్ తో మర్యాదపూర్వకంగా సిబ్బంది వ్యవహరించాలని సమందిత అధికారులు తెలియజేస్తామని తెలిపారు. ఈ సందర్బంగా దయానంద్ ముదిరాజ్ మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్రం లో విద్యకు, వైద్యానికి ప్రముఖ స్థానం కల్పించుటకు ప్రతి ఒక్కరూ వారి భాద్యతగా వ్యవహరించాలని కోరారు.

# సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి

- ప్రజావాణికి 26 దరఖాస్తులు
- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



ములుగు జిల్లా, అక్టోబర్ 07 (తీన్మార్ న్యూస్): ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన 26 మంది దరఖాస్తు దారుల వద్ద నుండి అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్ జి, సంపత్ రావు లతో కలిసి స్వీకరించారు. అట్టి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో 26 దరఖాస్తులు రాగా 13 భూ సమస్యలకు సంబంధించినవి 2 ఉపాధి కల్పించుటకు, 3 లోన్లు మంజూరు కోరుతూ, 8 ఇతరములు వచ్చినవని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డి సి ఎస్ ఓ షహ ఫైసుల్ హుస్సేని, డి ఎం డి సి ఎస్ ఓ రాం పతి, డిసిఓ సర్దార్ సింగ్, ఎస్సీ కార్పొరేషన్ ఈ డి తుల రవి, డి ఈ ఓ పాణిని, సి పి ఓ ప్రకాష్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతితో మమేకం అయ్యే పండుగ బతుకమ్మ





**మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్**

హన్మకొండ, అక్టోబర్ 07 (తీన్మార్ న్యూస్): తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దంపట్టె పండుగ బతుకమ్మ పండుగ అని అన్నారు. బతుకమ్మ పండుగ మన బతుకు చిత్రాన్ని ఆవిష్కరిస్తుందని అన్నారు. ప్రకృతిని ఆరాధించే అతి పెద్ద పండుగ బతుకమ్మ పండుగ అని అన్నారు. బతుకమ్మ సంబరాలను ఆదివారం రోజున బాలసముద్రం లోని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. మహిళలు యువతులు తీరొక్క పూల తో పేర్చిన బతుకమ్మలతో వచ్చి ఆనందంగా బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో దాస్యం వినయ్ భాస్కర్ కుటుంబ సమేతంగా హాజరయ్యారు.

# బాధిత కుటుంబానికి ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే జి.మధుసూధన్ రెడ్డి



దేవరకద్ర, అక్టోబర్ 07 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా మదనాపురం మండల కేంద్రానికి చెందిన కృష్ణ కుమార్తె చారికకు నిమ్స్ ఆస్పత్రిలో గుండెకు సంబంధించిన శస్త్ర చికిత్స కోసం సీఎం సహాయ నిధి ద్వారా 2.50 లక్షలు రూపాయల ఎల్ఓసి సోమవారం వారి కుటుంబ సభ్యులకు అందజేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూధన్ రెడ్డి. ఈ కార్యక్రమంలోనాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అజ్ఞానం చీకట్లను పోగొట్టలేదా..?



నేనిక
హిందువుగా
జీవించనూ, మరణించనూ
అట్లాని
ముస్లింగానో, క్రైస్తవునిగానూ కాదూ
మానవజాతిని
వేల సంవత్సరాలు కట్టుబానిసలుగా ఉంచినా ముష్టిమతాలవి..
ప్రశ్న
సందేహాల నివృత్తికి ఆదారమని
ప్రగతికీ మూలమని బుద్ధుడు బోదించలేదా..
అజ్ఞానం చీకట్లను పోగొట్టలేదా..?
మురికికూపాలలో బతుకూలీడుస్తూ
జీవితం ఇంతేనని
వేదనచెందినోళ్ళకు మతంమర్మం గుట్టువిప్పి
నికార్సైన మనిషిగా నిలబెట్టలేదా బుద్ధుడూ...!!!
దైవం
అస్థిత్వాన్ని అడుగుట మహాపాపమని
పూర్వజన్మలో చేసిన పాపపుణ్యాల ఫలితం ఈ జీవితమని
మనతో ఊడిగం చేసుకున్నోళ్లను తన బోధనలతో
ఊరిపొలిమేరలు దాటించలేదా బుద్ధుడు
పుట్టుక, చావు ప్రకృతి ధర్మమని
ఆడ, మగ సమానమేనని పితృస్వామ్య వ్యవస్థపై
చెర్నకోల్ ఆడించలేదా బుద్ధుడు
ఇంకా నేనూ
హిందువుగానో మరో మతస్తుడుగానో
మనుగడ సాగించాలేనోయ్.
(బుద్ధుని బోధనలు అనే పుస్తకం వాల్పోల రాహుల్ మూలం తెలుగు డి చంద్రశేఖర్ రాసిన పుస్తకం చదివిన తర్వాత నా అభిప్రాయాన్ని ఈ కవిత రూపంలో రాశాను)
ఉర్వి
(ఐలయ్య అంకేశ్వరపు జర్నలిస్ట్)

# భక్తులకు రాజరాజేశ్వరి దేవి అలంకరణలో అమ్మవారి దర్శనం



పెబ్బేరు, అక్టోబర్ 07 (తీన్మార్ న్యూస్): దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అయిదో రోజు పెబ్బేరు పట్టణ కేంద్రంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సకల భువన బ్రహ్మాండాలకు రాజరాజేశ్వరీ దేవి ఆరాధ్య దేవత. మహాత్రిపుర సుందరిగా ఈ దేవత త్రిపురాత్రయంలో పూజ లందుకుంటుంది. ఆలయంలో ఆలయ అర్చకులు కిట్టు స్వామి అమ్మవారి అలంకరణ అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి ఆశీస్సులు తీసుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటి సభ్యులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# ఎంబీబీఎస్ లో సీట్లు సాధించిన అన్న, చెల్లెలు



అమరచింత, అక్టోబర్ 07 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా అమరచింత మండల పరిధి సింగంపేట గ్రామానికి చెందిన బి.మంజుల బీడీ కార్మికురాలు బి.రాజన్న మోటార్ మెకానిక్ కుమారుడు బి.కుమార్ సన్నీ,కూతురు వనపర్తి మెడికల్ కాలేజీలో సీటు సాధించాడు బి.స్పదన సంగారెడ్డి మెడికల్ కాలేజీలో సీటు సాధించింది. అన్న చెల్లలు ఎంబీబీఎస్ లో సీట్లు సాధించారు. పేదింటి ఆణిముత్యాలైన వీరిని శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ జాతర కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్, డివిజన్ అధ్యక్షులు కిన్నెర మహేందర్, డివిజన్ కార్యదర్శి డి.ఎస్ చంద్రశేఖర్, మండల అధ్యక్షులు శివన్న గారు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు, సలహాలు సూచనలకై హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, అక్టోబర్ 07 (తీన్మార్ న్యూస్): రుణమాఫీ ప్రక్రియపై రైతులకు, సలహాలు సూచనలు అందజేసేందుకు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం, అలాగే భూపాలపల్లి, మహాదేవపూర్ కార్యాలయాలల్లో హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వ్యవసాయ అధికారిని ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో ప్రజావాణి అనంతరం రుణమాఫీ ప్రక్రియపై రైతుల నుండి దరఖాస్తులు వస్తున్నాయని అందువల్ల వారి సమస్యలు నివృత్తి చేసేందుకు కలెక్టరేట్ లోని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలోను అలాగే భూపాలపల్లి, మహదేవ పూర్ మండలాల్లోని సహాయ వ్యవసాయ అధికారుల కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. రైతులు ఋణమాఫీకి సంబంధించి సలహాలు, సూచనలు కొరకు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం, కలెక్టరేట్ లోని ఎఫ్ 26 కార్యాల యంలో కానీ ఫోన్ ద్వారా విజయభాస్కర్ 7288894787 అలాగే సహాయ వ్యవసాయ సంచాలకులు జే బాబు 7288894710, భూపాలపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు రమేష్ 7288894771, మహాదేవపూర్ వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీపాల్ 7288894760లకు కాల్ చేసి కూడా తమ యొక్క సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. కార్యాలయ పనివేళల్లో ఉదయం 10:30 నుండి సాయంత్రం 5 గంటల్లోపు నేరుగా కార్యాలయాలకు వచ్చికానీ లేదా ఫోన్ ద్వారా గాని రైతులు ఋణమాఫీ కి సంబంధించిన సమస్యలు గురించి తెలుసుకోవచ్చని ఆయన సూచించారు. వచ్చినటువంటి ఫిర్యాదులపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

# బాధితులకు సెల్ ఫోన్లు అందజేత

## సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్ ఫోన్ల రికవరీ అమరచింత ఎస్సై సురేష్



అమరచింత, అక్టోబర్ 07 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా అమరచింత మండల కేంద్రానికి చెందిన వివిధ గ్రామాల చెందిన వడ్డే నవీన్,గుంటిపల్లి గోవిందు,మాసన్న, నిమ్మకాయల పాషా,చందు,పి వెంకటేష్ తమ మొబైల్ ఫోన్లను పోగొట్టుకోవడం జరిగింది. వెంటనే స్థానిక అమరచింత పోలీసుల సహాయంతో సీఈఐఆర్ నూతన పోర్టల్ లో అప్లై చేయగా అమరచింత సబ్ ఇన్స్పెక్టర్ సురేష్ ఆధ్వర్యంలో సిఈఐఆర్ పోర్టల్ ద్వారా బాధితులకు సోమవారం రోజు అమరచింత పోలీసులు ట్రస్ట్ చేసి రికవరీ చేసి బాధితులకు మరిచింత ఎస్సై సురేష్ మొబైల్ ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా అమరచింత ఎస్సై సురేష్ మాట్లాడుతూ ప్రజలు ఎవరైనా తమ సెల్ ఫోన్ ని ఎవరైనా దొంగలించినా లేదా పోగొట్టుకున్నట్లయితే వారు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా అట్టి నెంబర్ను https://www.ceir.gov.in వెబ్ సైట్ లోకి వెళ్లి అందులో పూర్తి వివరాలు పొందుపరచాలని అలా చేసినట్లయితే త్వరగా వారి మొబైల్స్ ని పట్టుకోవడం జరుగుతుందని కావున ప్రజలు సి ఈ ఐ ఆర్ నూతన అప్లికేషన్ ను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

# డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేత

## విద్యాశాఖ అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, అక్టోబర్ 07 (తీన్మార్ న్యూస్): డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు ఈ నెల 9న హైదరాబాదు ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందచేయనున్నందున తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో డిఎస్సి లో ఎంపికైన అభ్యర్థులను హైదరాబాద్ తరలించడానికి బస్సులు ఏర్పాట్లు తదితర అంశాలపై విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మన జిల్లా నుండి 220 మంది అభ్యర్థులు డీఎస్సీకి ఎంపికయ్యారని వారిని హైదరాబాదు తరలించడానికి 5 బస్సులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతి బస్సుకు లైజన్ అధికారు లుగా ఎంఈఓ, పోలీస్ కానిస్టేబుల్ ను పంపాలని సూచించారు. ప్రతి బస్సుకు సీరియల్ నెంబర్ కేటాయించి ఉపాధ్యాయులకు ఆ నెంబర్లను తెలియచేయాలని అన్నారు. ఉదయమే బయలుదేరాల్సి ఉన్నందున మార్గ మధ్యలో అల్పాహారం, భోజన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అభ్యర్థులకు ముందస్తుగా సమాచారాన్ని అందించి 9వ తేదీన నిర్ణీత సమయంలోగా బస్సులు బయలు దేరే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈఓ రాజేందర్, డిఆర్డీఓ అవినాష్, ఆర్డీఓ. మంగిలాల్, కలెక్టరేట్ ఏ ఓ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికి సంక్షేమ పథకాలు

## ఎమ్మెల్యే మేఘారెడ్డి



వనపర్తి నియోజకవర్గం, అక్టోబర్ 07 (తీన్మార్ న్యూస్): నేడు తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కొనసాగుతుందని ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాల ఫలాలు అందుతాయని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.

సోమవారం పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామంలో ఏర్పాటుచేసిన మహాలక్ష్మి పథకం రాయితీ సిలిండర్ల ధ్రువపత్రాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులకు ధృపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 10 సంవత్సరాల బిఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల కుప్పగా మార్చి రాష్ట్రాన్ని దివాలా తీయించిందని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పదంలో నడిపించేందుకు కావలసిన చర్యలు చేపడుతూనే ప్రజలకు సంక్షేమ పథకాల ఫలాలను అందజేస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం. ఉచిత విద్యుత్ రాయితీ సిలిండర్ల పంపిణీ. 10 లక్షల ఆరోగ్యశ్రీ, రైతు రుణమాఫీ లను అమలు చేసి తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అండగా నిలబడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆడపడుచుల అభివృద్ధిని ధ్యేయంగా భావించిన రేవంత్ రెడ్డి సర్కార్ మహిళా సంఘాల బలోపేతానికి అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. పాఠశాల విద్యార్థుల దుస్తుల తయారీ పావలా వడ్డీ రుణాలు, ఆర్టీసీ బస్సులు ఉచిత ప్రయాణం, రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసే ఆర్టీసీ బస్సులలో సైతం మహిళలను భాగస్వామ్యం చేస్తుందని, ఐదేళ్లలో కోటి మంది మహిళలు కోటీశ్వరులుగా మార్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కంకణబద్ధంగా ఉ ఒదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దసరా నుంచి ప్రతి అన్నదాత అకౌంట్లో రైతు భరోసా డబ్బులను ప్రభుత్వం జమ చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామాల్లోని ప్రతి సొంత ఇల్లు లేని ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇండ్లు చేస్తామని ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు ఇప్పటికే తయారు చేసి ఉంచామని ఎమ్మెల్యే తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ప్రతి ఒక్కరిని గెలిపించి తనకు అండగా నిలవాలని ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మనిషి ప్రజాప్రతినిధుడిగా ఎన్నికైతే అభివృద్ధికి ఎలాంటి ఆటంకాలు ఉ ఒడకుండా నిరాటంకంగా కొనసాగుతుందని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డు ఉపాధ్యక్షులు పెద్దమందడి మాజీ ఎంపీపీ టి.రఘు ప్రసాద్ వెల్టూరు గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, బాలచంద్రయ్య, పెద్దమందడి అడ్డాకుల మండలాల అధికారులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో, ఎంపీడీవో వివిస్ సద్గుణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామకృష్ణరెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్. జగదీశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీపీ టి.రఘు ప్రసాద్,మాజీ సర్పంచ్లు అర్.శ్రీనివాస్ రెడ్డి, బోయిని రమేష్, సి. వెంకటేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకట్ స్వామి, మాజీ, ఎంపీటీసీలు రాంచంద్రయ్య గౌడ్, చాపల సత్యరెడ్డి, డివిస్.మహేష్, దిందు వివేక్ సాగర్, ఒడ్డె శేఖర్, డీలర్ శ్రీనివాస్, తదితరులు పాలుగోన్నారు.

# ప్రభుత్వం ప్రజలను నమ్ముతే..

## ప్రతిపక్షాలు యూట్యూబ్ ఛానల్ లని నమ్ముతున్నాయి

- అభివృద్ధి జరుగుతున్న ప్రతిపక్షాలకు కనపడటం లేదు
- 18వేల కోట్ల తో రుణమాఫీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం



వరంగల్, అక్టోబర్ 07 (తీన్మార్ న్యూస్): బతుకమ్మ పండుగ ముందుగానే ఆడబిడ్డల కుటుంబాల్లో పండుగ చూడాలనే ముందుగానే చెక్కులను పంపిణి చేస్తున్నామని, చేసిన అభివృద్ధి ప్రతిపక్షాలకు కనపడటం లేదు అని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం రోజున కాజిపేట మండలానికి సంబందించిన 29 మంది లబ్దిదారులకు రూ. 2903364 ల కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం (ప్రజా భవన్ )లో లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత చరిత్రలో నిలిచిపోయే విధంగా రైతులకు రూ. 18వేల కోట్లతో రుణమాఫీ చేసింది, ఇంకా రుణ విముక్తి కానీ రైతులకు కూడా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేసిందని అన్నారు. ఋణమాఫీ చేస్తే రాజీనామా చేస్తా అని పలికిన నాయకుడు ఈ రోజు దొంగ మాటలు మాట్లాడుతున్నారు. ప్రజలే పక్కన పెట్టిన మమ్మల్ని కాదు అన్నట్టు వ్యవహారిస్తున్నారని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే పరమాపదిగా ముందుకు వెళ్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసే ప్రతిపక్ష పార్టీలకు ప్రజల బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వాలు వేల కోట్లు లక్షల కోట్లు అంటూ సోషల్ మీడియాలలో వార్తలలో పత్రికలలో గాలిలో మేడలు కట్టిన మాదిరి చూపెట్టిన కూడా కాంగ్రెస్ పార్టీ ఆచరణలో పెట్టిందని అన్నారు. దూర దేశాలలో ఉంటూ కొన్ని చిన్న చిన్న యూట్యూబ్ ఛానల్ లు ఏర్పాటు చేసుకుని ప్రభుత్వం పై నిందలు వేయడమే పనిగా పెట్టుకున్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని గత ప్రభుత్వ హయాంలో మిగిలిపోయిన సీఎం సహాయ నిది చెక్కులను సైతం తీసుకు వచ్చి పంపిణి చేయడం జరుగుతుందన్నారు. క్యాంప్ కార్యాలయం కు వచ్చిన ప్రతి ఒక్కరికి సహాయ సహకారాలు అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్బంగా 5మంది లబ్దిదారులకు రూ. 200500/ -ల విలువగల సీఎం సహా నిది చెక్కులను లబ్దిదారుల కుటుంబాలకు అందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ లు జక్కుల రవీందర్,మామిండ్ల రాజు, సయ్యద్ విజయ రాజాలి, ఏనుగు మానస రామ్ ప్రసాద్, మాజీ కార్పొరేటర్ అబుబకర్, కుమారస్వామి,సుంచు అశోక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎంఆర్ఓ భావ్ సింగ్ ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న ఫోన్లను అప్పగించిన ఎస్ఐ చలిగంటి నరేష్





గరిడేపల్లి, అక్టోబర్ 07 (తీన్మార్ న్యూస్): పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ లను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో కనిపెట్టి పోలీసులు భాధితులకు అందజేసినారు. గరిడేపల్లి మండలంలోని కల్మల్ చెరువు గ్రామానికి చెందిన అదే గ్రామానికి చెందిన మహిళ అనంతు ప్రమీల, మరొక వ్యక్తి తడికమల్ల ప్రవీణ్ మరియు కాల్వపల్లి గ్రామానికి చెందిన కొల్లి ఆశీర్వాదం అను వారు కొద్ది నెలల కిందట పోగొట్టుకున్న ఫోన్ లను ఆధునిక సాంకేతికత ద్వారా తిరిగి భాదితునికి అంద జేయటం జరిగింది. ఈ సందర్భంగా గరిడేపల్లి ఎస్సై నరేష్ మాట్లాడుతూ ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటె కనుక పోలీసు స్టేషన్ సంప్రదిస్తే పోయిన ఫోన్ సి ఈ ఐ ఆర్ యాప్ ద్వారా కనిపెట్టవచ్చు అనితెలియజేయటం జరిగింది. అలా అని తమ వస్తువుల పట్ల ఎవరు అ జాగ్రత్తగా ఉండకూడదని ఆయన సూచించారు. తమ ఫోన్ లను తిరిగి అప్పజెప్పినందుకు ఎస్సై నరేష్ కి వారు ధన్యవాదాలు తెలిపారు



# అక్టోబర్ 9 కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



మహబూబాబాద్ జిల్లా, అక్టోబర్ 07 (తీన్మార్ న్యూస్): ఈ నెల 9న హైదరాబాదులోని ఎల్బీ స్టేడియంలో నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారి చేతుల మీదుగా అందజేసే నియామక పత్రాల కార్యక్రమానికి వెళ్లేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఈనెల 9వ తేదీన ఎల్.బి స్టేడియంలో జరిగే నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయుల నియామక పత్రాలను అందజేసే కార్యక్రమం పై జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ తో కలిసి, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డి.ఎస్సీ. నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన 376 మంది నూతన ఉ పాధ్యాయులకు ఈనెల 9న నియామక పత్రాలను అందజేయడం జరుగుతుందని అందుకు అభ్యర్థులు ఒకరోజు ముందస్తుగా జిల్లా హెడ్ క్వార్టర్ కి వచ్చే విధంగా చూడాలని, వారికి అవసరమైన వసతి ఏర్పాట్లను చేయాలని, అభ్యర్థులను హైదరాబాదు ఎల్.బి స్టేడియంకు చేరవేయడానికి 8 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడంతో పాటు అల్పాహారం, భోజన సదుపాయాలు ఏర్పాటు చేయాలని ప్రతి బస్సులో ఒక పోలీస్,రెవెన్యు, మెడికల్ సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలని, పర్యవేక్షణకై లైజన్ అధికారులను నియమించాలన్నారు. జిల్లా నుండి బయలుదేరిన బస్సుల యొక్క ట్రాకింగ్ ప్రక్రియ మొత్తాన్ని చూసుకోవాల్సిందిగా ఈ.డీస్ట్రిక్ మేనేజర్ కు సూచించారు. ఈ సమీక్షలో అదనపు ఎస్పీ చెన్నయ్య, జెడ్.పి.సీ.ఈ.ఓ నర్మద,డి.పి.ఓ హరిప్రసాద్, ట్రైబల్ వేల్ఫేర్ అధికారి సైదా, జిల్లా వైద్యాధికారి డాక్టర్ మురళీధర్, జిల్లా విద్యాధికారి రాజేశ్వరరావు, మహబూబాబాద్ తహసీల్దార్ భగవాన్ రెడ్డి, ఈ.డిస్ట్రిక్ట్ మేనేజర్ ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

## సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో తాసిల్దార్ కి వినతి



ఆత్మకూర్, అక్టోబర్ 07 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్నటువంటి సమస్యలపై దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆత్మకూరు మండల సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఆత్మకూర్ తాసిల్దార్ కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న సమస్యలు త్వరగా పూర్తిచేయాలని గ్రామాలలో రోడ్లు మరియు రేచింతల గ్రామంలో స్మశాన వాటిక లేదు జూరాల గ్రామంలో ప్లాట్ల పంపిణీ చేయడం లేదు పిన్నంచెర్ల గ్రామంలో స్మశాన వాటిక ఆత్మకూరులో అక్రమ నిర్మాణాలకు పై 10శాతం ల్యాండ్ నిర్మించిన వారు ప్రభుత్వ ప్లాటినం కబ్ చేసిన వారిపై చట్టపరమైన చర్య తీసుకోవాలని ఈ విషయం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని వినతిపత్రం ద్వారా వారు పేర్కొన్నారు. ఇట్టి కార్యక్రమంలో సిపిఐ పార్టీ కమిటీ రాబర్ట్ శ్రీహరి నరసింహ లక్ష్మన్న దశరథ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు లయన్స్ క్లబ్ ఆఫ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో ఆర్థిక చేయూత




నేరేడుచర్ల, అక్టోబర్ 07 (తీన్మార్ న్యూస్): నిరుపేద వృద్ధులకు నిత్యవసర సరుకుల లయన్స్ క్లబ్ ఆఫ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షులు జిలకర రామస్వామి అధ్యక్షతన నేరేడుచర్ల మున్సిపాలిటీ ప్రాంతంలోని రామాపురం మరియానంద స్కూల్ ప్రహరీ ప్రక్కన రోడ్డు వెంట పట్టాలతో ఉన్న గుడారంలో నివసిస్తున్న ఆవుల కిష్టయ్య వీరమ్మ దంపతుల కు 2200 రూపాయల విలువైన బియ్యం కూరగాయలు నిత్యవసర సరుకులను క్లబ్ అధ్యక్షులు జిలకర రామస్వామి క్లబ్ జోన్ చైర్మన్ చల్లా ప్రభాకర్ రెడ్డి వారి గుడారం వద్ద అందించారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి క్లబ్ అధ్యక్షులు జిలకర రామస్వామి క్లబ్ జోన్ చైర్మన్ చల్లా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రామాపురం వీధి వెంట చిన్న గుడారంలో నివసిస్తున్న 85 సంవత్సరాలు గల ఆవుల కిష్టయ్య వీరమ్మ దంపతులకు నిరుపేదలు వృద్ధులైన వీరికి ఆర్థిక స్థితి లేనందున బలహీనమైనటువంటి వారి కుటుంబానికి లైన్స్ క్లబ్ వారి జీవన స్థితిని గమనించి లైన్స్ క్లబ్ ఈరోజు వారి కుటుంబానికి జీవనం సాగించడానికి సేవలో మార్గంగా కుటుంబాన్ని ఆదుకుంట కొరకు ఇట్టి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలియజేశారు. ఇటువంటి పేద కుటుంబాలను లైన్స్ క్లబ్ గుర్తిస్తూ తగిన సహాయాన్ని చేయూతను అందిస్తుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి ఎస్కే యూసుఫ్ క్లబ్ సభ్యులు చిత్రం విశ్వనాథ్ చిలకరాల శ్రీను జీఎటి కోఆర్డినేటర్ గుండా సత్యనారాయణ లూకాస్ స్థానికంగా ఉన్న యువత పాల్గొన్నారు. ఈ సేవలను అందించిన క్రమంలో స్థానికంగా ఉన్న లక్ష్మయ్య కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు లైన్స్ క్లబ్ సేవలను మీరు ఇలా విరివిగా పేద ప్రజలకు మరిన్ని సేవలు అందిస్తాం.

# మహా రుద్రాభిషేకం పోస్టర్ ఆవిష్కరణ

నేరేడుచర్ల, అక్టోబర్ 07 (తీన్మార్ న్యూస్): హుజూర్ నగర్ లోని ఎన్ ఎస్ పి క్యాంప్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 27న లోకకళ్యాణార్థం ఎనిమిది అడుగుల మట్టి శివలింగానికి నిర్వహించే మహా రుద్రాభిషేకాన్ని విజయవంతం చేయాలని నేరేడుచర్లలో సోమవారం వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. నాగ సాధువుల ఆధ్వర్యంలో మహా రుద్రాభిషేకం మహా భస్మాభిషేకం లక్ష రుద్రాక్షల అభిషేకము మంత్రపుష్పము నీరాజనాలు జలాభిషేక పూజా కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఓరుగంటి నాగేశ్వరరావు, కీత సుధాకర్, ఎడ్ల విజయ్, బెల్లంకొండ అమర్, మండల పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రాచకొండ రామ్మోహన్ రావు, పాల్వాయి రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు మాశెట్టి సైదయ్య, గోళ్ల సుధాకర్, సోమప్ప ఆలయ కమిటీ చైర్మన్ చిత్తనూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు



# దుర్గామాతకు పూజలు నిర్వహించిన కమలాపురం రాము

ఆత్మకూర్, అక్టోబర్ 07 (తీన్మార్ న్యూస్): శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం మూలమల్ల, రేచింతల, ఆరేపల్లి పలు గ్రామాలలో స్వామి ఆలయంలో కొలువైన దుర్గామాత అమ్మవారికి బిజెపి జిల్లా నాయకులు కంబలాపురం రాము ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కంబలాపురం రాముని శాలువాతో సత్కరించారు. అనంతరం దుర్గామాత కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. హైందవ ధర్మాన్ని ముందుకు నడుపుతున్న గ్రామ భజన మరియు కమిటీ సభ్యులను ప్రోత్సహించారు. ఇట్టి కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు పి విష్ణువర్ధన్ రెడ్డి, ఆరేపల్లి గ్రామ దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు దేవేంద్రం, ఏటి లక్ష్మణ్,టి సురేందర్, ప్రవీణ్ కుమార్ ,జి రాకేష్ ,అశోక్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

### కుటుంబానికి తాను ఎల్లవేళలా అండదండగా ఉంటారని భరోసా

వనపర్తి నియోజకవర్గ, అక్టోబర్ 07 (తీన్మార్ న్యూస్): పెద్దమందడి మండలం అల్వాల గ్రామనికి చెందిన మోహన్ గౌడ్ కుటుంబాన్ని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పరామర్శించారు. గత 15 రోజుల క్రితం మోహన్ గౌడ్ కొడుకు వంశీ గౌడ్ 21స మోటార్ సైకిల్ రోడ్డు ప్రమాదానికి గురై కాలు ప్యాక్చర్ కావడం జరిగింది. విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే వారి నివాసం లో కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబం అధైర్య పడకూడదని కుటుంబానికి తను ఎల్లవేళలా అండదండగా ఉంటానని ఎమ్మెల్యే వారికి భరోసా కల్పించారు. విద్యాభ్యాసం కావాల్సిన అందే సదుపాయాలను ఏర్పాటు చేయిస్తామని ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు సూచించారు.



కార్యక్రమంలో జి.సుదర్శన్ రెడ్డి,ఆదిత్యరెడ్డి,పాల్గొన్నారు.

# దుర్గామాతను దర్శించుకున్న మార్కెట్ చైర్మన్



### తోగుట వీర క్షత్రియ సంఘం నాయకులు

పెబ్బేరు, అక్టోబర్ 07 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణ కేంద్రంలో నవరాత్రులలో భాగంగా, శ్రీ శ్రీ శ్రీ చౌడేశ్వరి అమ్మ దేవాలయం దగ్గర తొగుట వీర క్షత్రియ సంఘం. అధ్వర్యంలో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో, సోమవారం పెబ్బేరు మార్కెట్ చైర్మన్ ప్రమోదిని రెడ్డి ,వైస్ చైర్మన్ ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి. పాల్గొని అమ్మ వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తొగుట వీర క్షత్రియ సంఘం నాయకులు, ప్రమోదిని పాండేశ్వరి రెడ్డి పెబ్బేరు మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి లను సన్మానించరు. ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గౌని యుగంధర్ రెడ్డి,మిద్దె శ్రీ కాంత్,తొగుట వీర క్షత్రియ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ సభ్యత్వంలో చురుకుగా పాల్గొనాలి

### లక్ష్యానికి మించి బిజెపి సభ్యత్వాలు చేయాలి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి పిలుపు



ఆత్మకూర్, అక్టోబర్ 07 (తీన్మార్ న్యూస్): బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కార్యకర్తలు చురుకుగా పాల్గొని లక్ష్యానికి మించి సభ్యత్వాలు నమోదు చేయాలని నారాయణపేట జిల్లా సభ్యత్వ నమోదు కన్వీనర్ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తానే స్వయంగా కార్యకర్తలతో సభ్యత్వ నమోదు చేయించారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు నిర్దేశించినలక్ష్యానికి మించి ఈనెల 15తేదీలోపు జోరుగా బిజెపి సభ్యత్వాలు చేపట్టాలని గడపగడపకు కార్యకర్తలు వెళ్లి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించి స్థానిక సంస్థల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ఈ సందర్భంగా వారు అన్నారు ప్రతి బూత్ నుంచి 200మందికి తగ్గకుండాసభ్యత్వాలు చేయాలనివారి సందర్భంగా కోరారు.

# మేమే కూలుస్తాం...

హైదరాబాద్: తెలంగాణలో హైడ్రా హీట్ కొనసాగుతోంది. అధికార పార్టీ నేతల ఫామ్ హౌస్‌లపై బీఆర్ఎస్ నేతలు విమర్శలు గుప్పిస్తుండటంతో.. కొందరు నేతలు క్లారిటీ ఇచ్చే పనిలో పడ్డారు. మాజీమంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి తన ఫామ్ హౌస్ ప్రభుత్వ నిబంధనల మేరకే ఉందన్నారు. ఒకవేళ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్నట్లయితే తానే దగ్గరుండి కూల్చివేయిస్తానన్నారు. ఇరవై ఏళ్ల క్రితమే అన్నీ పరిశీలించి, అధికారులతో కూడా చర్చించి ఫామ్ హౌస్ నిర్మించామన్నారు పట్నం మహేందర్ రెడ్డి.

ఈ మధ్య సర్వే చేసి బఫర్ జోన్‌లో లేదని అధికారులు నివేదిక ఇచ్చారన్నారు. బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి తన పేరు తెరపైకి తెచ్చి ఆరోపణలు చేస్తున్నారని, తన ఫామ్‌హౌజ్ రూల్స్‌కు విరుద్ధంగా అక్కడే కూల్చేద్దామన్నారు. మరోవైపు సీఎం రేవంత్ తన ఫామ్ హౌస్ కూల్చివేత అంశాన్ని ప్రస్తావించడంపై కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు స్పందించారు. కూల్చివేతల విషయంలో కాంగ్రెస్ పార్టీ నేతగా తనకు ఎలాంటి మినహాయింపులు వద్దని సీఎం రేవంత్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. సాధారణ పౌరుడి విషయంలో చట్టం ఎలా ఉంటుందో అలాగే వ్యవహరిస్తే చాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మూసీ ప్రక్షాళన, సుందరీకరణను స్వాగతిస్తున్నానని అన్నారు. కొంత మంది నేతలు వారి స్వప్రయోజనాల కోసమే విమర్శలు చేస్తున్నారన్నారు. మూసీ విషయంలో ప్రతిపక్షాలది మొసలి కన్నీరేనని ప్రజలందరికీ తెలుసని లేఖలో ప్రస్తావించారు. అక్రమమైతే తానే దగ్గరుండి కూలుస్తానని చెప్పారు.నఅధికార పార్టీ నేతలు తమ ఫామ్ హౌస్‌ల విషయంలో ప్రభుత్వానికి, విపక్షాలకు వివరణ ఇస్తుండటంలో.. ఇంకెంతమంది నేతలు ఈ జాబితాలో చేరిపోతారో అనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. బీఆర్ఎస్ నేతలు పదే పదే అధికార పార్టీ నేతల ఫామ్ హౌస్‌ల గురించి ప్రస్తావిస్తుండటంతో.. ఈ అంశం మరింత ఆసక్తికరంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# పోటీ పడి పెరుగుతున్న టామాటా, ఉల్లి

హైదరాబాద్: టమాటా ధరలు ఒక్కసారిగా సెంచరీ కొట్టేస్తోంది. ఎక్కడ చూసిన 80 రూపాయ కంటే తక్కువకు కిలో టమాటా దొరకడం లేదు. నిన్న మొన్నటి వరకు 50రూపాయల్లోపు ధర పలికే టమాటా ఇప్పుడు ఒక్కసారిగా డబుల్ అయిపోయింది. కొనేందుకు వెళ్తున్న వినియోగదారులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఉన్న వాటినోత సరిపెట్టుకుంటున్నారు. అసలే పండగ సీజన్ ఆపై ధర పెరిగిపోవడంతో ఏం తినాలని వాపోతున్నారు. టమాటా లేనిదే దాదాపు ఎవరింట్లో కూడా వంట పూర్తి కాదు. వెజ్ ఆర్ నాన్‌వెజ్ ఏం వండినా టమాటా ఉంటే ఆ వంటకానికి అదనపు రుచి వస్తుంది. కుటుంబానికి సరిపడేలా వంటకం పూర్తి అవుతుంది.ఇప్పుడు టమాటో వందకు చేరుకోవడంతో వినియోగదారులు ప్రత్యామ్నాయాలు చూసుకుంటున్నారు. కొందరు చింతపండును వినియోగిస్తుంటే మరికొందరు నిమ్మకాయలతో సరిపెట్టుకుంటున్నారు. ఈ మధ్యకాలంలో వాతావరణ పరిస్థితులకు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో పంటలు బాగా దెబ్బతిన్నాయి. అక్కడ పండించే పంట పూర్తిగా నాశనమైపోయింది. అక్కడి దిగుబడి పూర్తిగా పడిపోయింది. మధనపల్లిలో పరిస్థితి అంతే ఉంది. ఈ మూడు ప్రాంతాల నుంచి వచ్చే టమాటా ఒక్కసారిగా తగ్గిపోవడంతో పరిస్థితి మారిపోయింది. మొన్నటి వరకు యాభైరూపాయల వరకు ఉండే టమాటా ధరలు ఇప్పుడు ఏకంగా వంద రూపాయలకు చేరాయి. ఇప్పట్లో ఈ ధరలు తగ్గే అవకాశం లేదని తెలుస్తోంది. మదనపల్లె మార్కెట్‌లోనే టమాటా ధర 80 రూపాయలకుపైగా పలుకుతోంది. అంటే మిగతా ప్రాంతాలకు ఆ సరకు వెళ్లే సరికి వంద రూపాయలకు పైమాటే అంటున్నారు. ఉల్లిగడ్డల ధరలు కూడా ఆ స్థాయిలోనే కనిపిస్తున్నాయి. మహారాష్ట్ర నుంచి సరిపడా సరకు రాకపోవడంతో ఉల్లి రేటు పెరిగిపోతోంది. అది కూడా క్వాలిటీ ఉండటం లేదన్నది వినియోగదారులు చెబుతున్న మాట.

# ఓవైసీ అక్బరుద్దీన్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలి

### – న్యాయవాది మక్సూధ్ హైమద్

కామారెడ్డి : ఓవైసీ అక్బరుద్దీన్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ప్రముఖ న్యాయవాది మక్సూధ్ హైమద్ డిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రముఖ న్యాయవాది మాక్సు ద్ హైమద్ ఈ విషయంపై విలేకర్ల సమావేశం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆయన కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఐఎం పార్టీ నేషనల్ అధ్యక్షులు, ఎంపీ ఓవైసీ అక్బరుద్దీన్ శనివారం నిజామాబాద్ జిల్లాకు వచ్చిన సందర్భంగా మాట్లాడుతూ జీవదాన్ పాఠశాలలో విద్యార్థినీ పట్ల జరిగిన విషయంలో జీవధాన్ పాఠశాల యజమాన్యం నుండి నేను 30 లక్షల రూపాయలు తీసుకున్నానని , విద్యార్థిని తల్లిదండ్రులకు ఐదు లక్షల రూపాయలు ఇచ్చానని, మిగతా 25 లక్షల రూపాయలు తన దగ్గర ఉంచుకున్నాడని ఆ సభలో చెప్పడం జరిగిందన్నారు. దానిపైన కామారెడ్డి జిల్లా నుండి అక్బరుద్దీన్కు సవాల్ విసిరుతున్నాను, నేను జీవధాన్ పాఠశాల యజమాన్యం నుండి ఎలాంటి డబ్బులు తీసుకోలేదని, అలాంటి నేను 30 లక్షల రూపాయలు తీసుకున్నానని నాపైన ఆరోపణాలు చేయడం జరిగిందని, దానిపైన వెంటనే నాకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నాపైన మీరు ఏదైతే ఆరోపణలు చేసినారో అట్టి



విషయం పైన మీరు కామారెడ్డి కి రావాలని మసీదులో మాట్లాడుకుందామన్నారు. అలా కుదరదు అంటే నన్ను హైదరాబాద్లోని మీ ఇంటికి రమ్మంటే కూడా వస్తానని తెలిపారు. ఇంతవరకు నేను విద్యార్థిని తల్లిదండ్రులు కూడా కలవలేదని, కావాలని నాపైన ఆరోపణలు చేయడం జరిగిందని అన్నారు. దీనిపైన వెంటనే ఓవైసీ అక్బరుద్దీన్ వెంటనే నాకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నానన్నారు.

# మానవత్వంతో చేరదీస్తే మాదే అనడం సరికాదు

మల్హర్ రావు: మానవత్వంతో చేరదీస్తే ఇంటి స్థలం మాదే అనడం సరికాదని మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన రాంనేని పాని రాజారావు అన్నారు.సోమవారం గ్రామంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు వలస జీవనోపాధి కోసం పదేళ్ల క్రితం రుద్రారం గ్రామానికి చిన్నపల్లి సాంబయ్య అనే పెద కుటుంబానికి చెందిన అతను వచ్చి మీ స్థలంలో టేలా పెట్టుకొని కూరగాయలు, గాజులు అమ్ముకుంటు బ్రతుకుతామంటే తమ ఇంటి స్థలాన్ని రెంటుకు ఇచ్చినట్లుగా, మూడేళ్ళ క్రితం సాంబయ్య మరణించగా అతని కుటుంబం ఈ భూమి మాదే అనడం సరికాదన్నారు.జీవించడానికి భూమి ఇవ్వాలని, తమరు ఖాళీ చేయమన్నప్పుడు టేలాను తిష్టానడంతో పడినేళ్ల క్రితం మానవత్వంతో టెలా వేసుకొనిస్తే ప్రస్తుతం ఆయన భార్యలు చిన్నపల్లి రాజేశ్వరి, రమాదేవి లు భూమి మాదే అనడంపై ఆవేదన వ్యక్తం చేశారు.వీరికి సపోర్ట్ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు పూర్తి వాస్తవాలు తెలుసుకోకుండా తమపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు.తమ భూమి గ్రామంలో మెయిన్ రోడ్డుకు ఉండడంతో గ్రామంలో వివిధ రకాల కులస్తులు జీవనం కోసం ఎన్నో రకాల వ్యాపారాలు చేసుకునేందుకు తమ స్థలంలో షెడ్లు వేసుకున్నారని ప్రస్తుతం వారిని ఖాళీ చేయాలి తాము ఇండ్లు నిర్మాణం చేసుకుంటామని అనడంతో అందరూ ఖాళీ చేస్తే రమా, రాజేశ్వరి మాత్రం ఖాళీ చేయకపోగా తమపైనే కేసులు పెడుతూ ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. క్రమబద్ధీకరణలో భాగంగా తమ భూమి తమకే క్రమబద్ధీకరణ అయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



# ఆర్ఎంపీ వైద్యం వికటించి మహిళ మృతి

తాడ్వాయి : ములుగు జిల్లా తాడ్వాయి మండలం ఊరట్టం కాలనీ (కొత్తూరు) గ్రామానికి చెందిన (ఏబీపీఎం) కుర్రి రత్నకుమారి (45) ఓ ఆర్ఎంపీ వైద్యం వికటించడం వల్ల మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కుర్రి రత్నకుమారి (అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్మాస్టర్) గత నాలుగు రోజుల నుండి జ్వరం రావడంతో నార్లాపూర్ గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు రాజ్ కుమార్ వద్దకు వెళ్లి వైద్యం పొందారు. ఆదివారం సాయంత్రం జ్వరం ఎక్కువగా రావడంతో మళ్లీ ఆయన దగ్గరికి వెళ్లారు. ఆయన పరీక్షలు నిర్వహించి డెంగ్యూ జ్వరం వచ్చిందని చెప్పాడు. ఒక సెలేన్ బాటిల్ పెట్టి అందులో రెండు ఇంజక్షన్లు వేశాడు. అది అయిపోయిన అనంతరం మళ్లీ ఒక సెలైన్ బాటిల్ పెట్టి మళ్లీ రెండు ఇంజక్షన్లు కలిపాడు. దీంతో రత్నకుమారి పరిస్థితి విషమంగా మారింది. రత్నకుమారి పరిస్థితి గమనించి, వెంటనే ములుగు ఏరియా హాస్పిటల్ కి తరలించారు. అక్కడి వైద్యులు సెలైన్ బాటిల్ లో ఏ ఇంజక్షన్లు వేశాడు, ఏం వైద్యం చేశాడో తెలుసుకోవడానికి ఆ ఆర్ఎంపీకి ములుగు ఏరియా హాస్పిటల్ వైద్యులు ఫోన్ చేశారు. ఆయన అందుబాటులోకి రాలేదు. ఆయన ఫోన్ కలవకుండా పెట్టుకున్నాడు. ఆమె పరిస్థితి సీరియస్ గా ఉండడంతో మెరుగైన వైద్యం గురించి ఎంజిఎంకు 108 ద్వారా తరలించారు. తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యంలోనే రత్నకుమారి మృతి చెందారు. రత్న కుమారికి ఒక కొడుకు భాస్కర్, ఒక కూతురు ఉన్నారు. కాగా రత్నకుమారి భర్త సుమారు గత పది సంవత్సరాల క్రితమే మృతి చెందాడు. ఆమె కష్టం చేసుకుంటూ కూతురు పెళ్లి చేసింది. ఇప్పుడు కొడుకు అనాధగా మారాడు. దీంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



# కంపు కొడుతున్న నిర్మల్

అదిలాబాద్: నిర్మల్ జిల్లా మున్సిపాలటీ మురికి కంపుతో ముక్కులు పగిలేలా ఉందని స్థానికలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ జిల్లా కేంద్రంలోని ఏ గల్లి చూసిన చెత్తతోనే దర్శనమిస్తోంది. బయటకు అడుగు పెట్టాలంటే ముక్కులు మూసుకునేలా చెత్త వాసన కంప కొడుతోంది. కారణం ఏంటంటే అక్కడి మున్సిపల్ అదికారులు ఆరు రోజులుగా సమ్మెకు దిగడమే. మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో ఆర్థికంగా కుంగిపోయామని ఆవేదన వ్యక్తం చేస్తూ మున్సిపల్ కార్మికులు విధులు బహిష్కరించి సమ్మెకు దిగడంతో మున్సిపాలిటీ పరిదిలోని కాలనీల్లో చెత్త సేకరణ జరగక.. ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి కాలనీలన్నీ కంపుకొడుతొన్నాయి. దసరా పండుగ కావడంతో షాపింగ్ కోసం మార్కెట్ కొస్తున్న జిల్లా వాసులకు చెత్త కుప్పలే స్వాగతం పలుకుతున్నాయి. బతుకమ్మ పండుగ జరుపుకుందామంటే కాలనీల్లో పేరుకుపోయిన చెత్తే కళ్ల ముందు దర్శనమిస్తుండటంతో పట్టణ ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆరు రోజులుగా మున్సిపల్ కార్మికులు నిరసనలు , ధర్నా లు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో తీవ్ర మనోవేదనతో కొనసాగుతున్నారు మున్సిపల్ కార్మికులు. సమ్మెలో భాగంగా 7వ రోజు నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట గాంధీ పార్కులో మున్సిపల్ కార్మికులు శాంతియుత నిరసన చేపట్టారు . గత మూడు నెలలుగా తమకు వేతనాలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు చెల్లించకపోవడంతో తమ కుటుంబ పోషణ భారంగా మారిందని.. ప్రభుత్వం స్పందించి తమకు వెంటనే వేతనాలు చెల్లించాలని, లేనట్లయితే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇది ఇలాగే కొనసాగితే నిర్మల్ పట్టణం దసరా పండుగను చెత్త కుప్పల మద్యే జరుపుకోవాల్సి వస్తుందేమోనని స్థానిక జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పండుగను దృష్టిలో పెట్టుకుని చెత్తను తొలగించే ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు తీర్చాలని నిర్మల్ పట్టణ వాసులు కోరుతున్నారు.

# 20 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్..

హైదరాబాద్: పేద విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్య అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, కాంప్లెక్స్‌ల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 20 నుంచి 25 ఎకరాల్లో ఇంగ్లీష్ మీడియాలకు దీటుగా రెసిడెన్షియల్ స్కూళ్లు నిర్మించి నర్సరీ నుంచి ఇంటర్ వరకు మెరుగైన ఉచిత విద్య అందిస్తామని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో చాలా రెసిడెన్షియల్ స్కూళ్లకు ఇప్పటివరకూ సొంత భవనాలు లేవని, ఇరుకైన బిల్డింగ్స్ లో ఈ స్కూళ్లు ఉన్నాయన్నారు. రాష్ట్ర సచివాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ప్రతి నియోజక వర్గంలో ఒక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు నిర్మిస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంగ్లీష్ స్కూళ్లకు దీటుగా రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ లను నిర్మిస్తామని చెప్పారు. ఇది చాలా మంచి కార్యక్రమం కనుక దసరా పండుగ కంటే ముందే రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ ల నిర్మాణానికి భూమి పూజ చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థపై స్పెషల్ ఫోకస్ చేసిందని, అందులో భాగంగా గురుకులాలు, రెసిడెన్షియల్ స్కూళ్లకు భారీగా నిధులు కేటాయిస్తామన్నారు. ఈ కాంప్లెక్సులను సాధ్యమైనంత త్వరగా నిర్మించి పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందిస్తామని చెప్పారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది రూ. 5వేల కోట్లు ఖర్చు చేస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వివరించారు. తెలంగాణ ప్రభుత్వం నిర్మించనున్న ఇంటిగ్రేడెట్ రెసిడెన్షియల్ స్కూల్స్ కు సంబంధించిన ప్లాన్ మీద పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేశారు. ఈ క్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర సీఎస్ శాంతికుమారి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో అద్దె భవనాల్లోనే రెసిడెన్షియల్ స్కూళ్లు సీనియర్ అధికారులతో ఓ కమిటీ వేశాం. కనీసం మూడు నెలల్లో వీటికి సంబంధించి పూర్తి వివరాలతో నివేదిక చేసి ప్రభుత్వానికి అందిస్తారు. రెసిడెన్షియల్ స్కూళ్లలో వసతులు సరిగ్గాలేదు. 1023 రెసిడెన్షియల్ స్కూళ్లు 620 స్కూళ్లకు బిల్డింగ్ లేదు. బీసీ వెల్ఫేర్ 327 స్కూళ్లు ఉంటే 306 స్కూళ్లు అద్దె భవనంలో ఉన్నాయి. సోషల్ వెల్ఫేర్ స్కూళ్లు 268 ఉండగా అందులో 135 వరకు అద్దె భవనాల్లోనే ఉన్నాయి. భవనాలు, మౌలిక వసతులు, టీచింగ్ ఫ్యాకల్టీ సరిగ్గా లేని కారణంగా విద్యా వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. కనుక మేం అధికారంలోకి వచ్చాక విద్యా వ్యవస్థపై, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యపై ఫోకస్ చేశాం.

గత ప్రభుత్వం కేవలం రూ. 73 కోట్లు ఖర్చు పెడితే కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల కోసం తాము రూ. 5000 కోట్లు కేటాయిస్తున్నాం. మాకు మంచి అవకాశం దొరికింది అనుకునేలా పిల్లలు మంచి విద్యా సంస్థల్లో చదివేలా చూస్తామని' భట్టి విక్రమార్క పలు అంశాలను ప్రస్తావించారు. విద్యార్థులకు కేవలం చదువు మాత్రమే కాదు ఆటలు, పాటలు, ఇతర టాలెంట్ వెలికితీసేలా విధానాన్ని అవలంభిస్తామని చెప్పారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 7 లక్షల కోట్లు అప్పు చేసినా స్కూల్ బిల్డింగ్స్ లేవు, సరైన విద్యా వసతి లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.

# అమెరికాలోని వర్జీనియా నగరంలో వైభవంగా దసరా, బతుకమ్మ వేడుకలు

## పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు

అమెరికా వాషింగ్టన్ డీసీ లోని గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్, వాషింగ్టన్ డీసీ చాప్టర్ ఆధ్వర్యంలో దసరా, బతుకమ్మ వేడుకలు వైభవంగా జరిగాయి. వాషింగ్టన్ డీసీ పరిధి వర్జీనియాలోని అష్బర్న్ ఇండిపెండెన్స్ హై స్కూల్ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ మెగా ఈవెంట్ కు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ సభ్యులతో కలిసి జ్యోతి ప్రజ్వాలన చేసి మంత్రి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన 7 వేలకు పైగా మంది ప్రవాసీయులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. మహిళలు, చిన్నారులు తీకొక్క పూలతో బతుకమ్మను పేర్చి ఆడి పాడారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..' అంటూ ఆడపడుచులు సామూహికంగా పాడుతూ, చప్పట్లు కొడుతూ కోలాటాలు, సాంప్రదాయ నృత్యాలు చేస్తూ.. లయబద్ధంగా కదులుతుంటే ఆడిటోరియం అంతటా సందడి నెలకొంది. వారిని అనుసరిస్తూ కుటుంబ సభ్యులు చప్పట్లు కొట్టారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు పోతురాజులు, హైదరాబాదీ బ్యాండ్ చేసిన సందడి అంతా ఇంతా కాదు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతితో పాటు తెలంగాణ సంస్కృతిని ప్రపంచం నలుమూలల ప్రతిబింబించేలా పండుగలు నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. తమ సంస్కృతి, సాంప్రదాయాలు మరువకూడదని, భావితరాలకు వారసత్వంగా అందించాలన్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో ఎన్ఆర్ఐ లు అందించిన సహాకారం మరువలేనిదని తెలిపారు.

అనంతరం యూఎస్ గవర్నమెంట్ హౌస్ ఆఫ్ డెలిగేట్స్ అందరూ కలిసి గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ (ఉం) వాషింగ్టన్ డీసీ ఛాప్టర్ కు ప్రోక్లమేషన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్జీనియా డెలిగేట్ శ్రీనివాసన్ కన్నన్, అటార్నీ జనరల్ జేసన్ ఎస్. మియారెస్, లౌడన్ కౌంటీ సూపర్వైజర్ లౌరా సావినో, లౌడన్ కౌంటీ స్కూల్ బోర్డు డాక్టర్ సుమేరా రషీద్, డెమొక్రాట్ పార్టీ నేత శ్రీధర్ నాగిరెడ్డి, ఉం వాషింగ్టన్ డీసీ చాప్టర్ ప్రెసిడెంట్ మునుకుంట్ల తిరుమల్ రెడ్డి , చైర్మన్ కళావల విశ్వేశ్వర్, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ పడూరు శ్రీవన్ రెడ్డి , నేషనల్ ట్రెజరర్ ముద్దసాని సుధీర్, బోర్డ్ ఆఫ్ ట్రస్టీ నంది సమరేంద్ర, దేశినేని సంపత్, ఉం వనిత టీమ్ తెలకుంట్ల జయశ్రీ , ప్రత్యూష నారపరాజు, సేరిపల్లి రేఖ తదిరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికి వారు కృతజ్ఞతలు

# రైతు భరోసా అందకుండానే ముగిసిన సీజన్

నిజామాబాద్: రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం చేయిచ్చింది. వానాకాలం వ్యవసాయ సీజన్ ముగిసిపోయింది. అంటే సాగు భూముల్లో పంటల సాగు ముగిసింది. కానీ, ప్రభుత్వం నుంచి రైతులకు అందాల్సిన పంటల పెట్టుబడి సాయం రైతు భరోసా అందనేలేదు. అసలు జిల్లాల వ్యవసాయ శాఖకు ప్రభుత్వం నుంచి రైతు భరోసా విషయంలో ఎలాంటి ఆదేశాలు అందలేదు. తెలంగాణ కొత్త రాష్ట్రంలో 2014 లో తొలిసారి అధికారంలోకి వచ్చిన నాటి టీఆర్ఎస్ ప్రభుత్వం సీజన్ కు ఎకరాకు రూ. 5వేల చొప్పున రెండు సీజన్ల ( ఖరీఫ్, రబీ)కు రూ. 10వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని రైతు బంధు పేరును అందించింది. నిరాటంకంగా కొనసాగింది. 2023 చివరన తెలంగాణ లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పాలన పగ్గాలు చేప్పటి 10 నెలలు గడిచిపోయినా.. ఇంతవరకూ నయా పైస రైతులకు పెట్టుబడి సాయంగా అందించలేదు. రైతుబంధు పేరును రైతు భరోసాగా మార్చి, రూ. 5వేల స్థానే ఎకరాకు రూ. 7500 చొప్పున రెండు సీజన్లకు కలిపి రూ. 15000 అందిస్తామని ఎన్నికల హామీల్లో పేర్కొంది. రైతు రుణ మాఫీకే నిధులన్నీ హరించుకుపోవడంతో రైతు భరోసా డబ్బులు వేయేలేదేమోన్న అభిప్రాయాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. రైతు రుణ మాఫీలో తలమునకలైన బ్యాంకర్లు, చివరకు పంట రుణాలనూ సకాలంలో ఇవ్వలేక పోయారు. పంట రుణాలు అందక, ప్రభుత్వం నుంచి పంటల పెట్టుబడి కోసం అందాల్సిన రైతు భరోసా సాయం అందక చివరకు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద రైతులు అప్పులు చేసి పంటలు సాగుచేసుకున్నారని రైతు సంఘం నాయకులు చెబుతున్నారు. రైతు భరోసాకు సంబంధించి ప్రభుత్వం నుంచి తమకు ఇంకా ఎలాంటి ఆదేశాలు అందలేదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. కనీసం రైతు భరోసాకు సంబంధించిన సమాచారం కూడా లేదంటున్నారు. ఇపుడు రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ శాఖ పంటల సర్వే లో నిమగ్నమై ఉంది. పంటల సాగు వివరాలతో డిజిటల్ సర్వే పనులు నడుస్తున్నాయి. ఈ వివరాలన్నీ సేకరించాక ప్రభుత్వానికి నివేదిస్తామని పేర్కొంటున్నారు. రైతు భరోసాకు ఎలాంటి రైతులు అర్హులు అన్న అంశాన్ని తేల్చేందుకు ప్రభుత్వం మంత్రుల ఉప సంఘాన్ని కూడా నియమించింది. ఈ కమిటీ నియామకైన రెండు వారాలకే ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని, ఆ నివేదిక అందాక అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించింది. ఇది జరిగి రెండు నెలల గడువు ముగిసినా.. ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. ఈ లోగా వ్యవసాయ సీజన్ ముగిసింది పోయింది. జిల్లా వ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్లో 10.50 లక్షల పైచిలుకు ఎకరాల్లో పంటలు సాగుచేశారు. ఇందులో 5.40 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగైతే, 5.10 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. గత ప్రభుత్వ హయాంలోని గణాంకాల మేరకు 5.42 లక్షల పైచిలుకు రైతులకు పంటల పెట్టుబడి సాయం అందేది. అప్పటి లెక్కల ప్రకారం జిల్లాలో రెండు సీజన్లకు కలిపి రమారమి రూ. 1250 కోట్లు రైతు బంధు కింద అందేది. ఎకరాకు రూ. 5వేల చొప్పున రెండు సీజన్లకు కలిపి ఎకరాకు రూ. 10వేలు అందిస్తే అంత మొత్తం ఖర్చయ్యేది. ప్రస్తుతం ప్రభుత్వం ఎకరాకు రూ. 7500 చొప్పున అందిస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో రెండు సీజన్లకు ఎకరాకు రూ. 15000 ఖర్చు చేయాల్సి వచ్చేది. అంటే, రూ. 1875 కోట్లు రైతు భరోసా సాయం అందాల్సి ఉండింది. కానీ, సీజన్ ముగిసిపోయినా ఎలాంటి సాయం అందకపోవడంతో ఆ మేర జిల్లా రైతాంగం నష్టపోయినట్టేనని అభిప్రాయపడుతున్నారు.

# ఆరు బెర్తులు..12 మంది ఆశవహులు

హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ లో పదవుల ఆశలు చిగురిస్తున్నాయి. పలు సార్లు వాయిదా పడుతూ వస్తున్న మంత్రివర్గ విస్తరణపై మళ్లీ ఊహాగానాలు జోరందుకున్నాయి. దసరాకు అటు ఇటుగా మంత్రివర్గ విస్తరణ ఉంటుందనే టాక్ వినిపిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఢిల్లీ పర్యటన నేపథ్యంలో పార్టీలో జోరుగా చర్చ జరుగుతోంది. మంత్రివర్గ విస్తరణతో పాటు ఇతర నామినేటెడ్ పదవుల చర్చ నేపథ్యంలో ఎవరెవరికి ఛాన్స్ రానుందనే చర్చ పార్టీలో నడుస్తోంది ఢిల్లీలో పర్యటనలో కేబినెట్ విస్తరణకు పార్టీ అధిష్టానం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చే అవకాశం ఉంది. జమ్ముకశ్మీర్ ఎన్నికల ప్రక్రియ కూడా పూర్తి కావడంతో.. క్యాబినెట్ అంశంపై డిస్కస్ చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం క్యాబినెట్ లో 6 బెర్తులు ఖాళీగా ఉన్నాయి.

ఆ ఆరు స్థానాల కోసం దాదాపు డజనుకు పైగా నేతలు పోటీపడుతున్నారు. వీటిలో ప్రధానంగా క్యాబినెట్ లో స్థానం దక్కని ఉమ్మడి జిల్లాలు, సామాజిక సమీకరణాలు బేరీజు వేసుకుని భర్తీ చేసే ఛాన్స్ ఉంది. ఉమ్మడి జిల్లాల వారీగా చూస్తే ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు ప్రాతినిధ్యం లేదు. ఈసారి మంత్రివర్గ విస్తరణలో ఈ జిల్లాలకు ప్రాతినిధ్యం దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఇద్దరు నేతలు తీవ్రంగా పోటీపడుతున్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ ల మధ్య పోటీ తీవ్రంగా ఉంది. ప్రేమ్ సాగర్ రావుకు భట్టి విక్రమార్క సపోర్ట్ గా ఉంటే.. వివేక్ కు అధిష్టానం హామీ ఇచ్చిందని సీఎం రేవంత్ మద్దతుగా నిలుస్తున్నారు. ఇక, ఉమ్మడి కరీంనగర్ నుంచి ఇప్పటికే క్యాబినెట్ లో శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ ఉన్నప్పటికీ.. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పోటీ పడుతున్నారు. తెలంగాణలో మున్నూరు కాపు బలమైన సామాజికవర్గం కాబట్టి.. అదే సామాజికవర్గానికి చెందిన ఆది శ్రీనివాస్ పోటీలో ఉన్నారు. క్యాబినెట్ లో అవకాశం లేని మరో జిల్లా నిజామాబాద్ నుంచి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావ్ మధ్య పోటీ నెలకొంది. మరోవైపు ఉమ్మడి నల్గొండ నుంచి క్యాబినెట్ లో ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలు ఉన్నారు. తాజాగా అదే జిల్లా నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ రేసులో ఉన్నారు. రాజగోపాల్ రెడ్డికి పార్టీ అధిష్టానం హామీ ఇచ్చిందని టాక్ నడుస్తోంది. క్యాబినెట్ లో యాదవ, కురుబ సామాజికవర్గం నుంచి ఎవరూ లేకపోవడంతో తనకు ప్రమోషన్ ఇవ్వాలని విప్ బీర్ల ఐలయ్య పట్టుబడుతున్నారు. క్యాబినెట్ లో లంబాడ సామాజికవర్గం నుంచి ఎవరూ లేకపోవడంతో తనకు అవకాశం ఇవ్వాలని బాలూ నాయక్ కోరుతున్నారు. ఇక ముదిరాజ్ సామాజికవర్గం నుంచి ఒకరికి ఛాన్స్ ఇస్తామని ఇప్పటికే సీఎం రేవంత్ ప్రకటించిన నేపథ్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లా మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి ముదిరాజ్ ఆశలు పెంచుకున్నారు. ముదిరాజ్ సామాజికవర్గానికే చెందిన ఉమ్మడి మెదక్ జిల్లా నేత నీలం మధు ముదిరాజ్ కు అవకాశం ఇవ్వాలని పార్టీ ఇంఛార్జ్ దీపాదాస్ మున్షీ పట్టుబడుతున్నారు. అలాగే, ఉమ్మడి మెదక్ జిల్లాకే చెందిన మైనంపల్లి రోహిత్ రావు కూడా మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. మైనార్టీ వర్గం నుంచి ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్ సైతం రేసులో ఉన్నారు. ఇలా మొత్తం మీద ఉన్న ఆరు స్థానాల కోసం డజను మంది నేతలు పోటీ పడుతున్నారు. పోటీ తీవ్రంగా ఉండటంతో క్యాబినెట్ విస్తరణ ఇన్నాళ్లూ వాయిదా పడుతూ వచ్చింది. ఇప్పుడు హర్యానా, జమ్ముకశ్మీర్ ఎన్నికలు పూర్తి కావడంతో అధిష్టానం తెలంగాణ క్యాబినెట్ విస్తరణపై దృష్టి సారించనుంది. పార్టీకి నష్టం కలగకుండా అన్ని సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని.. క్యాబినెట్ కూర్పు చేసే ఛాన్స్ ఉంది. కేబినెట్ లో ఛాన్స్ దక్కని వారికి ఇతర నామినేటెడ్ పదవులు ఇచ్చే అవకాశం ఉంది.

# దంతెవాడ నుంచి కీలక నేతలు మిస్

రాయ్ పూర్: ఈ భారీ ఎన్ కౌంటర్‌లో చనిపోయిన వారిలో మావోయిస్టు పార్టీ ముఖ్యనేతలు ఉన్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. కానీ పోలీసులు ఊహించినట్లు, ప్రచారం జరిగినట్లు అగ్రనేతలు ఎవరు మృతి చెందలేదు. ఎదురుకాల్పుల్లో మావోయిస్టు పార్టీ కార్యదర్శి నంభాల కేశవరావు, దండకారణ్య రాష్ట్ర కమిటీ సభ్యులు తక్కల్లపల్లి వాసుదేవరావు మృతి చెందారని ప్రచారం జరిగింది. కానీ ఛత్తీస్ ఘడ్ పోలీసులు ఎదురుకాల్పులు, మృతుల వివరాలు తెలిపిన తరువాత ఈ ఇద్దరు నేతలు లేరని తేలిపోయింది. నాంబాల కేశవరావు, తక్కల్లపల్లి వాసుదేవ రావులకు వరంగల్ జిల్లాకు సంబంధాలు ఉన్నాయి. నాంబాల కేశవరావు వరంగల్ నగరంలోని అప్పటి అర్ ఈ సీ, ఇప్పటి ఎన్ ఐ టీ లో బీటెక్ పూర్తి చేసి పీపుల్స్ వార్ బాట పట్టారు. నంబాల కేశవరావు స్వగ్రామం ఆంధ్రప్రదేశ్ శ్రీకాకుళం జిల్లా జియ్యాన్నపేట గ్రామం. తక్కల్లపల్లి వాసుదేవ రావు ఉమ్మడి వరంగల్ జిల్లా ములుగు వేంకటాపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామం. ఈ ఇద్దరు నేతలు సుదీర్ఘకాలంగా మావోయిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితులై పనిచేస్తున్నారు. వీరి మృతి చెందారని ప్రచారం జరగడంతో హక్కుల సంఘాలు, మావోయిస్టు సానుభూతి సంఘాలు ఎన్ కౌంటర్ లో మృతి చెందిన వారి వివరాలు వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశాయి. కానీ చనిపోయిన వారిలో కేశవరావు, వాసుదేవరావు లేక పోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

దంతేవాడ డీఐజీ కమ్లోచన్ కశ్యప్ మాట్లాడుతూ.. 'భారీ ఎన్ కౌంటర్ తర్వాత నక్సలైట్లకు కంచుకోటగా ఉన్న తూర్పు బస్తర్ డివిజన్‌లోని మావోయిస్టులలో భయానక వాతావరణం నెలకొంది. నక్సలైట్ల అగ్ర నాయకత్వం ఈ ప్రాంతాన్ని తమ సురక్షిత ప్రాంతంగా భావించేది. కానీ తాజా ఆపరేషన్ తరువాత, నక్సలైట్ నాయకత్వం తమ క్యాడర్ ను, స్థానికులను నిందిస్తోందని తెలిపారు. ఈ ఏడాది నారాయణపూర్ జిల్లాలో నిర్వహించిన ఆపరేషన్‌లో ఇప్పటివరకు మొత్తం 44 మంది మావోయిస్టులు మరణించినట్లు నారాయణపూర్ ఎస్పీ ప్రభాత్ కుమార్ తెలిపారు. మరో 29 మంది మావోయిస్టులను అరెస్టు చేయగా.. మరో 47 మంది మావోయిస్టులు పోలీసుల సూచనలతో లొంగిపోయా రని చెప్పారు. రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పి. మాట్లాడుతూ.. నిషేధిత, చట్ట విరుద్ధమైన సిపిఐ మావోయిస్టు సంస్థపై చర్యలు తీసుకునేందుకు, డిఆర్‌జి, కేంద్ర పారామిలటరీ బలగాలు, స్థానిక జిల్లా పోలీసు బలగాలు సమన్వయంతో, వ్యూహంతో పని చేయాలన్నారు. 2024లో బస్తర్ డివిజన్‌లో యాంటీ నక్సల్ ఆపరేషన్‌లో 188 మంది నక్సలైట్లు మృతిచెందారు. మరో 706 మందిని అరెస్టు చేయగా, 733 మంది నక్సలైట్లు పోలీసుల ఎదుట లొంగిపోయారు. 2024లో మావోయిస్టు అగ్ర నాయకత్వానికి భద్రతా దళాలు భారీ నష్టాన్ని కలిగించాయని సుందర్‌రాజ్ పి తెలిపారు. ఈ ఏడాది ఇప్పటివరకూ డికేఎస్ జడ్సీ జోగన్న పెద్దపల్లి జిల్లా, డికేఎస్ జడ్సీ రంధర్, వరంగల్ జిల్లా, డికేఎస్ జడ్సీ రూపేష్, గడ్చిరోలి జిల్లా మహారాష్ట్ర, టిఎస్సీ సభ్యుడు సిఆర్సి 02 కమాండర్ సాగర్ భూపాలపల్లి జిల్లా, డివిసీఎం శంకర్ రావు, భూపాలపల్లి జిల్లా,డివిసీఎం వినా వరంగల్ జిల్లా, డివిసీఎం జగదీష్, బాలాఘాట్ జిల్లా మధ్యప్రదేశ్, ఏసీఎం సంగీత అలియాస్ సన్నీ, గడ్చిరోలి జిల్లా మహారాష్ట్ర, ఏసీఎం లక్ష్మి, మల్కన్‌గిరి జిల్లా ఒరిస్సా రాష్ట్రం, ఏసీఎం రజిత వరంగల్ జిల్లా తెలంగాణకు చెందిన ఇతర రాష్ట్రాల నంచి వచ్చిన సీనియర్ మావోయిస్టు క్యాడర్ పలు ఎన్‌కౌంటర్లలో మరణించినట్లు తెలిపారు.

# చంపి... అత్యాచారం జరిగినట్టు సీన్ క్రియేట్ చేసి

హైదరాబాద్: ఓ మహిళను హత్య చేసి, పోలీసులను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించింది మరో కిలాడీ లేడీ. సంఘటనా స్థలాన్ని లైంగిక దాడి సీన్‌గా మార్చింది. ఎట్టకేలకు మాయ లేడీని అరెస్ట్ చేసిన కూకట్‌పల్లి పోలీసులు కటకటాల వెనక్కి నెట్టారు. నిజామాబాద్ జిల్లా బోధన్ పరిధిలోని యేదేపల్లి గ్రామానికి చెందిన ప్రియాంక(20) అనే మహిళ కేపీహెచ్‌బీలో వ్యభిచారం చేస్తూ, రాత్రుళ్ళు ఫుట్ పాత్ పై నిద్రించేది. అదే సమయంలో ఆమెకు మంజుల అనే మహిళతో పరిచయం ఏర్పడింది.

రోడ్డుపై ఉంటున్న తనకు భద్రత లేదని, తన వద్ద ఉన్న వెండి ఆభరణాలు మంజుల వద్ద భద్రపరిచింది. కొద్ది రోజులకు తన వెండి ఆభరణాలు తిరిగి ఇవ్వాలని ప్రియాంక కోరగా, మంజుల వెనక్కి ఇవ్వకపోవడంతో.. ప్రియాంక మంజులను అంతు చూస్తానని బెదిరించి వెండి ఆభరణాలు తిరిగి తీసుకుంది. తనకు ప్రియాంకతో, ప్రాణహాని ఉందని భావించిన మంజుల, ఆమెకు సెప్టెంబర్ 30వ తేదీన మద్యం తాగించి, కేపీహెచ్‌బీ లోధా అపార్ట్‌మెంట్స్ ఎదురుగా ఉన్న నిర్మానుష్య ప్రదేశంలోకి తీసుకువెళ్ళి బ్లేడుతో గొంతు కోసి హత్య చేసింది. ఆపై ప్రియాంకను ఎవరో అత్యాచారం చేసి హతమార్చినట్లుగా సీన్ క్రియేట్ చేసి అక్కడి నుండి పరారయ్యింది. ప్రియాంక మృతదేహం లభించటంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు మొదలుపెట్టారు కూకట్‌పల్లి పోలీసులు. లోధా టవర్స్ ఎదురుగా ఉన్న సీసీ కెమెరా ఫుటేజ్ లను పరిశీలించిన తర్వాత మంజుల కదలికలను గుర్తించారు. ఆమెను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ జరిపారు పోలీసులు. పథకం ప్రకారం మంజుల నిర్మాణస్య ప్రాంతానికి ప్రియాంకను తీసుకువెళ్లి తన వెంట తీసుకువచ్చిన ప్లేట్లతో ఆమెను తీవ్రంగా గాయపరిచి హతమార్చినట్టు పోలీసులు దర్యాప్తులో తేల్చారు. ఆ తర్వాత మరుసటి రోజు అక్కడికి వెళ్లి అత్యాచారం సీన్ క్రియేట్ చేసింది. ప్రియాంకను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు అఘాయిత్యానికి పాల్పడి, హతమార్చినట్టు వదంతులు సృష్టించింది. ఆ తర్వాత ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలుపెట్టారు. పోలీసులకు లభించిన కీలక క్లూ ఆధారంగా ఈ మొత్తం హత్య మిస్టరీని ఛేదించారు. కేవలం తనకున్న ప్రాణహాని కారణంగానే ప్రియాంకను మంజుల దారుణంగా హత్య చేసినట్టు తేల్చారు పోలీసులు. ఆ తర్వాత ప్రియాంకను అదుపులోకి తీసుకని కటకటాల వెనక్కి నెట్టారు కూకట్‌పల్లి పోలీసులు.

# దేశానికే ఆదర్శంగా కొత్త రెవెన్యూ చట్టం

నాగార్జునసాగర్: ప్రస్తుతం ఉన్న రెవిన్యూ చట్టంలో మార్పులను తీసుకువచ్చి దేశానికే రోల్ మోడల్ గా ఉండేలా నూతన రెవెన్యూ (ఆర్ ఓ ఆర్ ) చట్టాన్ని తీసుకురానున్నామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం ఉన్న రెవెన్యూ చట్టంలో తప్పొప్పులను సవరించి ,అన్ని రకాల భూ సమస్యలను పరిష్కరించి నూతన చట్టాన్ని తీసుకువచ్చేందుకు ఉద్దేశించి పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన నాగార్జునసాగర్ నియోజకవర్గం, తిరుమలగిరి సాగర్ మండలం, నెల్లికల్ గ్రామంలో నిర్వహించిన రైతుల ముఖాముఖి కార్యక్రమానికి మంత్రి శనివారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో తెచ్చిన 2020 రెవెన్యూ చట్టం,ధరణి వల్ల రాష్ట్రంలోని రైతులు, ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని,, 2020 చట్టాన్ని అలాగే ధరణిలోని తప్పొప్పులను సవరించేందుకు దేశంలోని అన్ని రెవెన్యూ చట్టాలను పరిశీలించి మేలైన చట్టం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను సేకరించి పబ్లిక్ డొమైన్ లో ఉంచినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే తిరుమలగిరి సాగర్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయడం జరిగిందని ,నూతన రెవెన్యూ చట్టంపై ప్రజల అభిప్రాయాలను తీసుకున్న తర్వాతే చట్టం తీసుకురావాలని ,అలాగే ప్రధాన ప్రతిపక్ష పార్టీల సూచనలు సైతం పరిగణలోకి తీసుకొని అతి కొద్ది రోజుల్లోనే నూతన రెవెన్యూ చట్టాన్ని ప్రజల ముందుకు తీసుకురాబోతున్నామని మంత్రి వెల్లడించారు. అర్హులైన పేదవారికి. ప్రభుత్వ భూములు అందాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమని ,ప్రత్యేకించి తిరుమలగిరి సాగర్ లో కొంతమంది పొజిషన్లో ఉన్నప్పటికి పట్టాలు లేవని, పట్టాలున్న వారికి భూమిలేదని, అలాగే ఎవాక్యూవేషన్ ప్రాపర్టీ కి సంబంధించి, ఇతర ప్రభుత్వ భూములకు సంబంధించిన చేస్తున్న సర్వే పూర్తయిన తర్వాత సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని తెలిపారు. తిరుమలగిరి సాగర్లో సుమారు 13 వేల ఎకరాల కు బోగస్ పట్టా పాస్ పుస్తకాలు ఉన్నట్లు రెవెన్యూ అధికారులు తమ దృష్టికి తీసుకువచ్చారని, ప్రభుత్వం పేదలకు మంచి చేయాలన్నదే తపన అని, ప్రభుత్వాస్తులన్నీ పేదవాడికి చెందాలని, పేదవాడికి చెందేలా ప్రభుత్వ నిర్ణయం ఉంటుందని చెప్పారు. తిరుమలగిరి సాగర్ లోని 3500 నుండి 4 వేల ఎకరాలు అర్హులైన పేదవారికి పట్టాలు ఇవ్వాల్సి ఉందని, డిసెంబర్ 9న రాష్ట్ర ముఖ్యమంత్రిని నాగార్జునసాగర్ నియోజకవర్గానికి తీసుకువచ్చి ఇక్కడే బహిరంగ సభ ఏర్పాటు చేసి నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని వేలాది ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు పంచుతామని మంత్రి వెల్లడించారు.

# మూసీ మద్దతుగా నల్గొండ రైతులు

నల్గొండ: మూసీ ప్రక్షాళన అంశం ఇప్పటికే రాజకీయ మంటలు రేపుతోంది. అధికార, ప్రతిపక్ష పార్టీల సవాళ్లు, ప్రతిసవాళ్లకు వేదికగా నిలుస్తోంది. మూసీ రివర్ బెడ్ లోని ఆక్రమణలను తొలగించడం, మూసీ మురుగు నీటి శుద్ధీకరణ, సుందరీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 1.50లక్షల కోట్ల ప్రాజెక్టుకు డిజైన్ చేసింది. మూసీ నదిపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్న రైతులు ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని భువనగిరి, తుంగతుర్తి, నకిరేకల్, సూర్యాపేట, మిర్యాలగూడ నియోజకవర్గాల్లో ఉన్నారు. మూసీ ప్రక్షాళన విషయంలో ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని.. జిల్లా రైతులు రాష్ట్ర ప్రభుత్వానికి అండగా నిలవాలని నిర్ణయించు కున్నారు.కాలుష్య కూపంగా మారిన మూసీ నదిని ప్రక్షాళనకు జరిగిన ప్రయత్నాలు చాలా తక్కువ. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒకింత ప్రయత్నించినా అది నివేదికలు, అంచనాల దశ దాటలేదు. హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ జిల్లా ప్రజల జనజీవనంతో పెనవేసుకున్న మూసీ నది నీరు.. ఇపుడు విషతుల్యంగా మారింది. ఏళ్లుగా మూసీ నీటిపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతుల సంఖ్య తక్కువేం కాదు.నకిరేకల్ నియోజకవర్గం సోలిపేట గ్రామం వద్ద మూసీ నదిపై మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టును 1960ల్లోనే నిర్మించారు. గతంలో ఈ నది నీరు సాగు, తాగు, పాడి, మత్స్య రంగాలకు ఉపయోగపడేది. హైదరాబాద్ దాటి వచ్చాక ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో మూసీపై 24 కత్వాలు నిర్మించారు. వీటి ద్వారా సాగు నీరు అందేది. ఇదే మూసీ నీటిపై ఆధారపడిన ఆసిఫ్ నహర్ వంటి చిన్న తరహా ప్రాజెక్టులు కూడా ఉన్నాయి. ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి కాల్వలూ ఉన్నాయి. కానీ.. కాలుష్య నీటితో పండించిన పంటలను మార్కెట్‌లో అమ్ముకో లేని దుస్థితి నెలకొంది.అంతర్జాతీయ నగరంగా పేరున్న హైదరాబాద్‌లో మూసీ దుర్గంధాన్ని వెదజల్లుతోంది. మానవ వ్యర్ధాలు, ఔషధ, రసాయన పరిశ్రమల వ్యర్థాలతో విషతుల్యంగా మారిన మూసీ నీరు ప్రజలకు అనారోగ్యాలను పంచుతోంది. ఇపుడు రాష్ట్ర ప్రభుత్వం మూసీ శుద్ధీకరణ, సుందరీకరణకు నడుం కట్టడంతో మూసీ పరీవాహక ప్రాంతాల వాసుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. మూసీ ఆక్రమణల తొలగింపు వివాదాస్పదం కావడం, ప్రతిపక్షాలు ప్రధానంగా బీఆర్ఎస్, బీజేపీ నిర్వాసితుల పక్షాన ఆందోళనలకు దిగుతుండడంతో ప్రభుత్వానికి మద్దతుగా నిలిచేందుకు జిల్లా రైతాంగం సమావేశం కావాలని నిర్ణయించుకున్నారు.ప్రభుత్వం ఎస్టీపీలతో మురికి నీటిని శుద్ధి చేసి, గోదావరి జలాలతో నింపి, రైతులకు మంచినీరు అందించాలనే లక్ష్యంతో ముందుకు వెళుతోందని అధికార కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. మూసీ నదిని శుద్ధి చేసి పరివాహక ప్రాంత ప్రజలను కాలుష్యం నుంచి విముక్తి కలిగించాలని ఆలోచనతో ప్రభుత్వం ముందుకు వెళుతుంటే, ప్రతిపక్షాలు కుట్రలు పన్ని అడ్డుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రతిపక్ష నాయకులు రైతులను, ప్రజలను తప్పుదోవ పట్టించి మూసి ప్రక్షాళన అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని, ప్రతిపక్షాల కుట్రలను తిప్పి కొట్టేందుకు రైతాంగాన్ని సమీకరిస్తున్నామని పేర్కొంటున్నారు. ఇప్పటికే అధ్వానంగా తయారైన మూసీ నదిని.. ఇకనైనా శుద్ధీకరించి కాపాడుకోకుంటే మూసీ పరీవాహక ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోతారన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

# తాండూరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి కి కాయకల్ప అవార్డు

**- రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి**

**- 3 సార్లు కాయకల్ప అవార్డు సొంతం**

**- వచ్చే నెలలో రూ. 25లక్షలు నగదు అందజేత**

**- కేంద్ర బృందం సర్వేలో 94శాతం మార్కులతో అవార్డు**

**- హర్షం వ్యక్తం చేస్తున్న వైద్యాధికారులు..**

వికారాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కాయకల్ప అవార్డుల్లో వికారాబాద్ జిల్లా లోని తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి రాష్ట్ర స్థాయిలో సత్తాచాటి అవార్డు సొతం చేసుకుంది . 94శాతం మార్కులతో మొదటి స్థానంలో నిలిచి అవార్డును సాధించింది. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు అందుతున్న సేవ లపై సర్వే చేసి అన్ని విభాగాల్లో అత్యుత్తమ సేవలు అందిస్తున్న ఆస్పత్రులకు కాయకల్ప అవార్డులను అందజేస్తోంది. ఈ కోవలో రాష్ట్రస్థాయిలో తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మొదటి స్థానంలో నిలిచింది. స్వచ్ఛభారత్ అభియాన్, నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో 2023,24 సంవత్సరానికి గాను ప్రభుత్వ ఆస్పత్రుల నిర్వహణపై కాయకల్ప అవార్డు ఫలితాలను వైద్య ఆరోగ్య శాఖ గురువారం ప్రకటించింది. రాష్ట్రంలోని అన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల్లో పారిశుధ్య నిర్వహణ, బయో మెడికల్ వేస్టేజ్ నిర్వహణ, హైజిన్ ప్రాధాన్యత, ఇన్ఫెక్షన్ కంట్రోల్ ప్రాక్టీస్ తోపాటు తదితర అంశాలపై కాయ కల్ప పోటీలు జరిగాయి. అందులో రాష్ట్రంలోని పలు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రులు, సీహెచ్ సీలు, పీహెచ్ సీలు పోటీ పడ్డాయి. ఈ పోటీల్లో రాష్ట్రంలో 94శాతం మార్కులతో తాండూరులోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, హైదరాబాద్ లోని కింగ్ కోఠి ప్రభుత్వ ఆస్పత్రి మొదటి స్థానంలో నిలిచాయి.

తాండూరు ఆస్పత్రికి మూడోసారి కాయకల్ప ఆవార్డు వచ్చింది. 2000 – 21 – 22లో వరు సగా రెండు సార్లు అవార్డు వరించింది. గతేడాది రేసులో వెనుకబడింది. 2023– 24 సంవత్సరంలో కేంద్ర సర్వే బృందాన్ని మెప్పించింది. దీంతో మూడోసారి అవార్డు వచ్చింది. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిశంకర్ త్వరలో ఢిల్లీలో వైద్య ఆరోగ్య శాఖ నుంచి అవార్డును అందుకుంటున్నట్లుగా తెలిపారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిశంకర్ మాట్లాడుతూ...

తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి రాష్ట్రస్థాయి కాయకల్ప అవార్డు రావడం సంతోషంగా ఉంది. గతంలో రెండు సార్లు అవార్డు వచ్చింది. అవార్డు రావడం వెనుక ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది సమష్టి కృషి ఫలితము ఉన్నాయని అదే విధంగా ఆస్పత్రిలో అన్ని సేవలు రోగులకు అందించడం,ప్రతి రోజు ఆస్పత్రిలో నిర్వ హించే పారిశుద్ధ్య కార్యక్రమం కూడా జరగడం . వీటితోపాటు ఆస్పత్రిలో ఎలాంటి ఇబ్బం దులు తలెత్తకుండా ప్రజాప్రతినిధులు సహకరించడం జరగడం వల్ల ఈ అవార్డును సొంతం చేసుకున్నట్లుగా తెలిపారు.

# మైలేజ్... డ్యామేజ్...

వరంగల్: ప్రస్తుతం తెలంగాణ రాజకీయం అంతా కొండా సురేఖ చుట్టూ తిరుగుతోంది. ఇటు కాంగ్రెస్.. అటు సినిమా ఇండస్ట్రీ నుంచి రకరకాల కామెంట్స్ వినిపిస్తున్నా.. బీఆర్ఎస్ మాత్రం వ్యూహాత్మకంగా మౌనంగా ఉంది. దీంతో బీఆర్ఎస్‌కు పొలిటికల్ మైలేజ్.. కాంగ్రెస్‌కు డ్యామేజ్ అనే చర్చ జరుగుతోంది.కొండా సురేఖ.. ఒకప్పుడు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఫైర్ బ్రాండ్ లీడర్. కొండా ఫ్యామిలీ అంటే అదో రకమైన ఫీలింగ్ జిల్లా ప్రజలకు ఉండేది. కొండా దంపతులు కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లోకి వెళ్లినప్పుడు చాలామంది వ్యతిరేకించారు. అనేక రాజకీయ పరిణామాల మధ్యలో కొండా ఫ్యామిలీ మళ్లీ హస్తం గూటికి చేరింది. అందరూ అనుకున్నట్టే సురేఖ విజయం సాధించి.. మంత్రి కూడా అయ్యారు.ఇక్కడిదాకా అంతా బాగానే ఉన్నా.. అసలు సమస్య ఈ మధ్యే మొదలైంది. వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన మాజీమంత్రి బస్వరాజు సారయ్య కూడా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారు. ఆయన ఇదే నియోజకవర్గం నుంచి గతంలో మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. మంత్రిగా పనిచేశారు. ఆయనకూ ఓ వర్గం సపోర్ట్ బాగా ఉంది. ఈ ఇద్దరు నేతలు ఒకే పార్టీలో ఉండటంతో చాలా రోజులుగా కోల్డ్ వార్ జరుగుతోంది.ఈ వార్ జరుగుతుండగానే.. కొండా ఫ్యామిలీ ప్రధాన అనుచరుడు ఒకరు వార్తల్లోకి ఎక్కారు. ఆయన పోరు పడలేకపోతున్నామని కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలే ప్రభుత్వ పెద్దల వద్ద మొరపెట్టుకున్నారు. దీంతో సర్కారు ఇంటలిజెన్స్ అధికారుల నుంచి నివేదిక తెప్పించుకొని.. అతనికి ఉన్న సెక్యూరిటీని తొలగించింది. త్వరలోనే అతనిపై చర్యలుంటాయనే ప్రచారం జరుగుతోంది.సరిగ్గా ఈ సమయంలో.. కొండా సురేఖ కొత్త వివాదంలో చిక్కుకున్నారు. ఏ ఉద్దేశంతో మాట్లాడారో తెలియదు కానీ.. సినిమా ఇండస్ట్రీని టచ్ చేశారు. అది కూడా మామూలుగా కాదు. ఏకంగా సినిమా ఇండస్ట్రీ అంతా ఏకమయ్యేలా మంత్రి కామెంట్స్ ఉన్నాయి. దీంతో కొండా సురేఖ టాక్ ఆఫ్ ది తెలంగాణగా మారారు. పార్టీ తేరుకొని వివరణ ఇప్పించే ప్రయత్నం చేసినా.. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది.అక్కినేని నాగార్జున కోర్టు మెట్లెక్కి.. కొండా సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పిటిషన్ దాఖలు చేశారు. ఈ ఇష్యూ అత్యంత సున్నితమైంది కావడంతో.. కాంగ్రెస్ పార్టీ నుంచి కూడా కొండా సురేఖతు సపోర్ట్ చేసేవారు లేకుండా పోయారు. ఏం మాట్లాడితే.. మన మెడకు ఏం చుట్టుకుంటుందోనని కాంగ్రెస్ పార్టీ నేతలే మాట్లాడుకుంటున్నట్టు తెలిసింది. అందుకే సైలెంట్‌గా ఉండటం బెటర్ అనే అభిప్రాయంలో ఉన్నట్టు.. వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యే ఒకరు చెప్పారు.కొండా సురేఖ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను టార్గెట్ చేస్తూ విమర్శలు చేశారు. కానీ.. ఆ విషయం పక్కకుపోయి.. సమంత– నాగచైతన్య విడాకుల వ్యవహారం తెరపైకి వచ్చింది. దీంతో సినీ ప్రముఖులు అంతా ముక్తకంఠంతో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కానీ.. కేటీఆర్‌పై ఈ స్థాయిలో ఆరోపణలు చేసినా.. బీఆర్ఎస్ మాత్రం వ్యూహాత్మకంగా మౌనంగా ఉంది. గులాబీ నేతలు ఎక్కడా ఈ ఇష్యూ గురించి మాట్లాడటం లేదు.బీఆర్ఎస్ మౌనం కారణంగా.. ఇప్పుడు వివాదం అంతా సినిమా ఇండస్ట్రీ, కాంగ్రెస్ పార్టీ మధ్య నడుస్తోంది. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా విషయంలో అనేక ప్రశ్నలను ఎదుర్కొంటుంది. నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్‌ను కూల్చినప్పటి నుంచి ఇండస్ట్రీ నుంచి కాంగ్రెస్ ప్రభుత్వంపై కాస్త వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అప్పుడు ఓ నిర్మాత ఇంట్లో కొందరు సినీ ప్రముఖులు భేటీ అయ్యి.. ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై చర్చించినట్టు వార్తలు వచ్చాయి.ఆ ఇష్యూ పూర్తిగా సమసిపోకముందే.. తాజాగా కొండా సురేఖ కామెంట్స్ అగ్గిలో ఆజ్యం పోసినట్టు అయ్యాయి. కూల్చివేత సమయంలో స్పందించని వారు కూడా ఇప్పుడు స్పందించి.. కొండా సురేఖ వ్యాఖ్యలను తప్పుబడుతున్నారు. అయితే.. ఈ వ్యవహారంలో మౌనంగా ఉండటమే తమకు మంచిదని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. ఇప్పుడు ఏది మాట్లాడినా రాజకీయంగా నష్టం జరగవచ్చని బీఆర్ఎస్ సీనియర్ నేత ఒకరు అభిప్రాయపడ్డారు.మొత్తానికి కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్‌గా ఉన్న పొలిటికల్ ఫైట్ ఇప్పుడు సైడ్ టర్న్ తీసుకుంది. దీంతో బీఆర్ఎస్ రిలాక్స్ అవుతోంది. అటు గులాబీ పార్టీ కూడా నేతలకు గట్టి సంకేతాలు ఇచ్చినట్టు తెలుస్తోంది. ఎవరు ఎంత రెచ్చగొట్టినా ఈ వ్యవహారంలో తలదూర్చవద్దని కీలక నేతలు వార్నింగ్ ఇచ్చినట్టు సమాచారం. ఏం మాట్లాడినా.. చర్యలు తప్పవని హెచ్చరించినట్టు బీఆర్ఎస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం కావాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

జయశంకర్ భూపాలపల్లి: ధాన్యం దిగుబడి అంచనా మేరకు కొనుగోళ్లకు సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శనివారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో వ్యవసాయ, పౌర సరఫరాలు, మార్కెటింగ్, సహకార పరిశ్రమలు, డిఆర్డీఏ శాఖల అధికారులతో దాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు, కొనుగోలు కేంద్రాలల్లో సౌకర్యాలు కల్పన, కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలకు శిక్షణా తరగతులు నిర్వహణ తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 105650 ఎకరాల్లో వరి సాగు జరిగిందని దాదాపు 2 లక్షల మెట్రిక్ టన్నుల వరకు దాన్యం వచ్చే అవకాశం ఉందని అంచనా మేరకు 300 కేంద్రాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వరి కోతలు ప్రారంభాన్ని బట్టి కోనుగోలు చేసేందుకు సిద్దంగా ఉండాలని సూచించారు. ఏడాది వానాకాలం సీజన్ లో రైతులు సాగు చేసిన వరి ధాన్యం చేతికి రావడానికి ఇంకా సమయం ఉన్నప్పటికీ కొనుగోళ్లపై అధికారులు సన్నదంగా ఉండాలని తెలిపారు. ఇందుకోసం అవసర మైన గన్నీసంచులు, ఎలక్ట్రానిక్ తూకపు యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు టార్పా లిన్లు, తేమ నిర్ధారణ యంత్రాలకు ప్రతిపాదనలు పంపాలని మార్కెటింగ్ డిఎం ను ఆదేశించారు. గత సంవత్సరం ఏ ఏ కేంద్రాల్లో దాన్యం ఎక్కువగా వచ్చిందో అంచనా ప్రకారం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల ఇంచార్జి లకు ముందుగానే శిక్షణా తరగతులు నిర్వహణకు షెడ్యూల్ తయారు చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో టెంట్లు, తాగునీరు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రభుత్వం సన్న ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రకటించినందున సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోలుకు విడివిడిగా కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి ప్రత్యేకంగా నంబర్లు వేయాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్, పౌరసరఫరాల సంస్థ డిఎం రాములు, జిల్లా వ్యవసాయ అధికారి విజయ భాస్కర్, సహకార అధికారి వాలియా నాయక్, మార్కెటింగ్ డిఎం కనక శేఖర్, పరిశ్రమల శాఖ జిఎం సిద్ధార్థ రెడ్డి, డిఆర్డిఎ డిపిఎం రవి, ఈడీఎం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మూసి ప్రక్షాళనకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే మద్దతు

హైదరాబాద్: మూసీ ప్రక్షాళన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా ముందుకు సాగుతోంది. రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో అధికారులు సైతం.. ప్రజలతో మమేకం అవుతూ.. మూసీ పరీవాహక ప్రాంత ప్రజలను ఒప్పించి.. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు తరలిస్తున్నారు. బీఆర్ఎస్ నేతలు చేస్తున్నా ఆరోపణలకు కాంగ్రెస్ నేతలు సైతం ధీటుగా బదులిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా తమ ఫాం హౌసులు ఉంటే సొంత ఖర్చులతో కూల్చేయడానికి సిద్ధం అంటున్నారు. ప్రభుత్వంపై బురద జల్లడమే టార్గెట్ గా పలువురు బీఆర్ఎస్ నేతలు తోచింది మాట్లాడేస్తున్న తరుణంలో.. సీఎం రేవంత్ చర్యలను స్వాగతిస్తున్నా అంటూ ఓ బీఆర్ఎస్ ఎమ్మెల్యే వ్యాఖ్యానించడం చర్చనీయాంశంగా మారుతోంది.మూసీ ప్రక్షాళన ధ్యేయంగా కాంగ్రెస్ సర్కారు వడివడిగా అడుగులు వేస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఇప్పటికే ప్రాథమికంగా మూసీలోని అక్రమ నిర్మాణాలు, నిర్వాసితులను గుర్తించిన ప్రభుత్వం మరోమారు సర్వే నిర్వహిస్తూ అర్హుల వివరాలు సేకరిస్తోంది. అధికారులు సైతం.. ప్రజలతో మమేకం అవుతూ.. నదీ పరీవాహక ప్రాంత ప్రజలను ఒప్పించి.. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు తరలిస్తున్నారు. ఇచ్చిన మాట మేరకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించడం పట్ల.. లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్‌లో మూసీ నది పరివాహక ప్రాంత రైతులతో సమావేశం కీలకంగా భావిస్తున్నారు. నాగోల్ శుభం గార్డెన్స్‌లో ఈ మీటింగ్ జరగనుంది. ఈ సమీక్షకు స్వచ్ఛందంగా హాజరై విజయవంతం చేయాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. ఉమ్మడి నల్గొండ జిల్లా రైతులకు, ముఖ్యంగా మూసి పరివాహక ప్రాంత రైతన్నను ఉద్దేశిస్తూ పత్రికా ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వాలు విస్మరించి మూసీ ప్రక్షాళనను కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలంటే రైతుల సహకారం అవసరమన్నారు.ప్రభుత్వం ఎస్టీపీ లతో మురికి నీరును శుద్ధి చేసి.. గోదావరి జలాలతో నింపి, రైతులకు మంచినీరు అందించాలని లక్ష్యంతో ముందుకు సాగుతుందని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. మూసీని శుద్ధిచేసి పరివాహక ప్రాంత ప్రజలకు కాలుష్యం నుంచి విముక్తి కలిగించాలని ఆలోచనతో సీఎం రేవంత్ రెడ్డి ముందుకు వెళుతుంటే ప్రతిపక్షాలు కుట్రలు పన్ని అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.సీఎం రేవంత్‌కు కాంగ్రెస్ సీనియర్ నేత కేవీపీ లేఖ రాశారు. తన ఫామ్ హౌస్ అక్రమని తేలితే సొంత ఖర్చుతో కూల్చేయానికి రెడీ అన్నారు. కాంగ్రెస్‌కు చెందిన వ్యక్తిని కాబట్టి తనకు ఎలాంటి మినహాయింపు వద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎలాంటి చెడ్డపేరు రాకూడదని లేఖలో కేవీపీ రాశారు.ఈబఒ, బఫర్ జోన్లో తన ఫామ్ హౌజ్ ఉంటే..తానే నేరుగా కూల్చేస్తానన్నారు మండలి విప్ పట్నం మహేందర్ రెడ్డి. నిబంధనల ప్రకారమే తన ఫామ్ హౌజ్ నిర్మాణం జరిగిందని అధికారులు నివేదిక ఇచ్చారని తెలిపారు. ఒకవేళ ఆ నివేదిక తప్పు అయితే..తానే ఫామ్ హౌజ్‌ను కూల్చేస్తానన్నారు. అధికారుల నుంచి తనకు ఎలాంటి నోటీసులు రాలేదన్నారు.మూసీ సుందరీకరణ చేయాల్సిందేనన్నారు బీఆర్ఎస్ కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు. అయితే అందుకు మూసీ పరివాహక ప్రాంత ప్రజలతో మాట్లాడి ఒప్పించాలని విజ్ఞప్తి చేశారు. అఖిలపక్ష సమావేశాన్ని పెడతామని సీఎం చెప్పడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు తలో మాట మాట్లాడుతూ ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నా తరుణంలో కృష్ణారావు సర్కారు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు వ్యాఖ్యానించడం హాట్ టాపిక్ గా మారింది.తెలంగాణకు పదేళ్లు సీఎంగా ఉన్న కేసీఆర్ చేసినవి అప్పులు, తప్పులేనని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు..పదేళ్లు రాష్ట్రాన్ని దోచుకున్న బీఆర్ఎస్ నేతలు.. ఫామ్‌హౌజ్‌లు కాపాడుకోవడానికే హైడ్రాకు, మూసీ ప్రక్షాళనకు అడ్డుపడుతున్నారన్నారు.మూసీ పరివాహక ప్రాంతంలో ఉంటున్న పేదల కష్టం తనకు తెలుసని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. సోషల్ మీడియాలో వస్తున్న వీడియోలు చూస్తుంటే తనకు బాధగానే ఉందని చెప్పారు. కానీ హైదరాబాద్ బాగు కోసం ఎవరో ఒకరు నడుం కట్టాల్సిందేనని.. అందుకే తాను మూసీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టానని తెలిపారు. పేదలకు ఏం చేయాలో ప్రతిపక్షాలు సలహాలు, సూచనలు చేస్తే.. తాము స్వీకరిస్తామని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.కూల్చివేతల్ని బూచిగా చూపి బీఆర్ఎస్ నేతలు ఎన్ని కుట్రలు చేస్తున్నప్పటికీ.. ప్రభుత్వం ప్రజల మద్దతుతో ముందుకు సాగుతోంది. కాంగ్రెస్ నేతలు సైతం తమపై వస్తున్న ఆరోపణలకు ధీటుగా బదులిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే సొంత ఖర్చులతో కూల్చేయడానికి సిద్ధం అంటున్నారు. హైదరాబాద్ బాగు కోసం నడుం కట్టానంటున్న సీఎం రేవంత్ చర్యలకు బీఆర్ఎస్ నేతలు కూడా స్వాగతం పలకడం చర్చనీయాంశంగా మారింది.

# పూలనే పూజించి దేవతలా చూసుకునే గొప్ప పండుగ బతుకమ్మ

**జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్**

జగిత్యాల: తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు, ఆడపడుచుల ఔన్నత్యానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ తెలిపారు. కలెక్టరేట్ సముదాయంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు వారి వారి శాఖల ద్వారా బతుకమ్మను తీరోక్క పూలతో తయారు చేసి మధ్యలో పెట్టి కోలాటాలు ఉయ్యాల పాటలు డీజే పాటల నడుమ బతుకమ్మ వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయన సతిమణితో కలిసి ఉద్యోగులతో బతుకమ్మ ఆడి పాడి వేడుకలలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మన పండగ మన సంస్కృతి మన సాంప్రదాయానికి ప్రతీక ఆడపడుచుల ఔన్నత్యానికి సూచిక అన్నారు. తొమ్మిది రోజులపాటు అడబిడ్డలు అందరూ కలిసి తీరొక్క పూలు, తీరొక్క రంగులతో ఆడుకునే గొప్ప పండగ బతుకమ్మ అని అన్నారు. మహిళలు ఎంతో ఇష్టంతో పూలను పేర్చి గౌరమ్మను తీర్చి కోరిన కోరికలు ఫలించాలనే నమ్మకంతో ఈ బతుకమ్మ పండుగ జరుపుతారని, దేశంలో పూలను పూజించి ప్రకృతి ని ప్రేమించే గొప్ప పండుగ బతుకమ్మ అని ఇలాంటి సంస్కృతి మన తెలంగాణలోనే ఉందని, బతుకమ్మ పండుగను అధికారికంగా రాష్ట్ర పండుగగా గుర్తించారని అన్నారు. ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని, బతుకమ్మ పండుగ సందర్భంగా జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి. రాంబాబు, గౌతమ్ రెడ్డి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి నరేష్, జిల్లా పంచాయతీ అధికారి రఘువరన్, వివిధ జిల్లా శాఖ అధికారులు, మహిళా ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# చెరువుల ఎఫ్‌టీఎల్ హద్దులు మార్చనున్న ప్రభుత్వం..!

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రియల్ఎస్టేట్ కు పెద్ద సమస్యగా మారిన చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ ల విషయంలో వస్తున్న అనేక అభ్యంతరాలను పరిష్కరించేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ కొత్త ప్రయత్నాలు చేస్తోందని విశ్వసనీయ సమాచారం. ఇందుకోసం ముందుగా ఫుల్ ట్యాంక్ లెవల్ హద్దులను పునసమీక్షించాలని నిర్ణయించింది. చాలా ఏళ్ళ కిందట ఎఫ్‌టీఎల్ హద్దులను నిర్ణయించారు. వాటిపై అప్పట్లో ఎవరూ పట్టించుకోలేదు కానీ ఇప్పుడు హైడ్రా దూకుడుతో ప్రజలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో హైదరాబాద్‌లో ఉన్న ప్రధానమైన 71 చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్స్ పై ఇప్పుడు సర్వే చేయించాలని, కొత్త ఎఫ్‌టీఎల్‌ను ఖరారు చేయాలని నిర్ణయించినట్లుగా తెలుస్తోంది.

ఈ మేరకు ముందుగా ముసాయిదా రిలీజ్ చేసిన తర్వాత ప్రజల అభ్యంతరాలు, సలహాలు, సూచనలు తీసుకుంటారు. ఫైనల్ గా అన్ని చెరువుల ఎఫ్‌టీఎల్ హద్దులను అధికారికంగా ప్రకటిస్తారు. ఆ తర్వాత ఎఫ్‌టీఎల్ లోపల ఉన్న భవనాలకు నోటీసులు జారీ చేసి కూల్చే అవకాశం ఉంది. ఇప్పుడు ఎఫ్‌టీఎల్ పరిధిలో లేనివి కొత్తగా వచ్చే అవకాశం లేదని కానీ చెరవుకు దూరంగా ఉండి, ఎఫ్‌టీఎల్ జోన్ లో ఉన్నట్లుగా రికార్డుల్లో ఉన్న వారికి మాత్రం ఊరట లభిస్తుందని అంటున్నారు.

ఎఫ్‌టీఎల్ ఖరారు చేస్తే ఆటోమేటిక్ గా బఫర్ జోన్ కూడా ఖరారవుతుంది. హైదరాబాద్ లో చెరువులు ఎక్కువ. సుదూరంగా చెరువు కనిపిస్తూందంటే ఇప్పుడు అక్కడ కొనుగోలు చేయడానికి చాలా మంది జంకుతున్నారు, దాంతో రియల్ ఎస్టేట్ పడిపోయిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అందుకే ప్రభుత్వం ఈ అంశానికి అధికారికంగా క్లారిటీ ఇచ్చేందుకు సిద్ధమవుతుంది.

ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత కొనుగోలుదారులకు భరోసా లభిస్తుంది కాబట్టి రియల్ ఎస్టేట్ రంగం మళ్ళీ పుంజుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# బతుకమ్మ మీద ఆంక్షలు దుర్మార్గం

బిజెపి మహిళా మోర్చా నేత డాక్టర్ శిల్పారెడ్డి

హైదరాబాద్: బిజెపి మహిళా మోర్చా ఆధ్వర్యంలో పాతబస్తీలో ప్రశాంత వాతావరణంలో, అత్యంత భక్తి శ్రద్ధలతో బతుకమ్మ వేడుకలు జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం అడుగడుగునా అడ్డంకులు సృష్టించి, ద్వేషం చూపించడాన్ని మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి తీవ్రంగా ఖండించారు. పోలీసు వ్యవస్థ ఎంఐఎం చేతిలో కీలుబొమ్మగా మారిందనడానికి ఇదే నిదర్శనం. మహిళలకు అలవిగాని హామీలిచ్చి, వారి ఓట్లతో అధికారంలోకి వచ్చి ఇప్పుడు ఆడబిడ్డలు ఘనంగా జరుపుకునే బతుకమ్మ వేడుకలను పక్కనపెట్టడం తెలంగాణ సంస్కృతిని, మహిళాలోకాన్ని అవమానించడమేనని అన్నారు. హైకోర్టు ఉత్తర్వులను సాకుగా చూపి, రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ వేడుకలు నిర్వహించుకోకుండా ఆంక్షలు విధించడం దుర్మార్గమైన చర్య. తెలంగాణ పోరాట చరిత్రను తప్పుదోవ పట్టించేలా, సంస్కృతిని కించపర్చేలా కుట్ర జరుగుతోంది. అసలు హిందూ పండుగలంటే ఎందుకింత కడుపు మంటనో స్పష్టం చేయాలి. పాతబస్తీ పాకిస్తాన్ లోనో, బంగ్లాదేశ్ లోనే లేదనే విషయం గుర్తెరగాలని హెచ్చరిస్తున్నామని అన్నారు.

# ఇండస్ట్రీ, సర్కార్ మధ్య గ్యాప్...

హైదరాబాద్: సినిమా ఇండస్ట్రీకి.. తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు విడదీయరాని అనుబంధం ఉంది. కొంత మంది నటులు వివిధ పార్టీల తరఫున రాజకీయాల్లో ఉన్నారు. చాలా మంది పార్టీలకు అతీతంగా పాలకులకు సహకరిస్తూ.. పాలకుల సహకారం పొందుతూ వస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచే ఈ సంప్రదాయం కొనసాగుతోంది. రాష్ట్ర విభజన తర్వాత కూడా ఇండస్ట్రీ వర్గాలు రెండు రాష్ట్రాల ప్రభుత్వాలకు సహకారం అందిస్తున్నాయి. అయితే 2019 నుంచి 2024 వరకు ఏపీ సర్కార్ నుంచి తెలుగు ఇండస్ట్రీకి మద్దతు కరువైంది. దాని ఫలితం 2024లో వైసీపీ అధికారం కోల్పవడానికి ఇండస్ట్రీ కూడా పరోక్షంగా కారణమైంది. తెలంగాణలో గడిచిన పదేళు ్లగా బీఆర్ఎస్ సర్కార్‌కు, ఇండస్ట్రీకి మధ్య సత్సంబంధాలు కొనసాగాయి. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. రెండ నెలల క్రితం వరకూ ఇండస్ట్రీ రేవంత్ సర్కార్‌కు అనుకూలంగానే ఉంది. కానీ హైడ్రా నాగార్జునకు చెందిన ఎన్‌కన్వెన్షన్‌ను కూల్చిన తర్వాత సర్కార్‌కు, ఇండస్ట్రీకి మధ్య గ్యాప్ పెరిగింది. నాగార్జున ఎన్ కన్వెన్షన్ అక్రమమే అయినా పదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం చూసీ చూడనట్లు వ్యవమ రించింది. రేవంత్ మాత్రం పెద్దలు, చిన్నతు, నేతలు, అధికారులు అనే తేడా లేకుండా ఆక్రమణలు కూల్చాలని హైడ్రాకు పవర్స్ ఇచ్చారు. దీంతో గత నెలలో నాగాజ్జున ఎన్ కన్వెన్షన్‌ను కూల్చింది.తాజాగా మంత్రి కొండా సురేఖ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌పై విమర్శలు చేసే క్రమంలో సినిమా ఇండస్ట్రీలోని మహిళా నటులతోపాటు సమంత, నాగచైన్య విడాకులకు కేటీఆర్ కారణమని సంచలన వ్యాఖ్యలు చేశారు. వివాదంతో సంబంధం లేని నాగార్జున ఫ్యామిలీని ఇందులోకి లాగడంతో ఇండస్ట్రీ ఒక్కసారిగా మంత్రిపై తిరగబడింది. నాగార్జున ఫ్యామిలీతో పాటు సమంత, పలువురు హీరోలు, హీరోయిన్లు, నటీనటులు మంత్రి వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో మంత్రి కొండా సురేఖ దిగి వచ్చారు. తన వ్యాఖ్యలను ఉప సంహరించు కుంటున్నట్లు తెలిపారు. తాను ఎవరినీ కించపర్చాలని ఈ వ్యాఖ్యలు చేయలేదని, కేటీఆర్ నైజం ఎండగట్టేందుకు మాత్రమే మాట్లాడానని తెలిపారు. అయినా ఇంకా ఇండస్ట్రీ నుంచి మంత్రి వ్యాఖ్యలపై విమర్శలు వ్యక్తమవుతున్నాయిమంత్రి కొండా సురేఖ చేసిన వాయఖ్యలపై హీరో నాగార్జున హైకోర్టును ఆశ్రయించారు. తన పరువుకు నష్టం కలిగించేలా మాట్లాడిన మంత్రిపై పరువు నష్టం దావా వేశారు. వివాదం పెద్దది అవుతుండడంతో రంగం లోకి దిగిన టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ రంగంలోకి దిగారు. వివాదాన్ని ఇంతటితో ఆపేయాలని కోరారు. అయినా ఇండస్ట్రీ వైపు నుంచి విమర్శలు కొనసాగుతున్నాయి. దీంతో అతిగా స్పందిస్తున్న ఇండస్రీటతీరుపై సీఎం రేవంత్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇండస్ట్రీ పెద్దల అతి కాంగ్రెస్ పెద్దలకు ఆగ్రహం తెప్పిస్తోంది. కాంట్రోల్ చేయాల్సిన ఇండస్ట్రీ పెద్దలు స్పందించకపోవడం కూడా తెలంగాణ ప్రభుత్వ అసంతృప్తికి కారణమవుతోంది. వ్యాఖ్యలు ఉప సంహరించుకున్న తర్వాత కూడా ఇండస్ట్రీవైపు నుంచి విమర్శలు కొనసా గడం సీఎంకు కోపం తెప్పించింది.సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే ఇండస్ట్రీ తీరును పలు మార్లు తప్పు పట్టారు. సినిమాలు తీస్తున్న నటీనటులు డ్రగ్స్‌కు అలవాటు కావొద్దని యువతకు ఎందుకు సూచించడం లేదని ప్రశ్నిం చారు. తర్వాత నంది అవార్డుల స్థానంలో గద్దర అవార్డు ఇస్తామని సీఎం ప్రకటించారు. కానీ, దీనికి అడుగు ముందుకు పడడం లేదు. టిక్కెట్ల రేట్ల పెంపు విషయంలో ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్న ఇండస్ట్రీ ఇతర విషయాలపై మాత్రం స్పందించడం లేదని పేర్కొన్నారు. తాజాగా మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై ఇండస్ట్రీ స్పందిస్తున్న తీరుపైనా సీఎం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఇండస్ట్రీపై సానుకూలంఆ ఉండాల్సిన పని లేదని భావిస్తున్నట్లు తెలిసింది. అతిగా స్పందించడం మాని తటస్తంగా ఉండే ప్రయత్నం చేయడం మంచిదని కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు.

# ఫైవ్ స్టార్ హోటల్ సౌకర్యాలతో వందే భారత్ స్లీపర్లు

చెన్నై: దేశంలో వందే భారత్ రైళ్లు దూసుకుపోతున్నాయి. ఇవి ప్రారంభించినప్పటి నుంచే అనూహ్య స్పందన వస్తున్నాయి. వీటిల్లో ప్రయాణం చేయడానికి చాలా మంద ఆసక్తి చూపుతున్నారు. ముందుగా ప్రధాన రూట్లలో ప్రారంభించిన వందే భారత్ ఎక్స్ ప్రెస్ లు ఇప్పుడు తక్కువ దూరంలో కూడా వెళ్తుననాయి. అయితే రైల్వే శాఖ తాజాగా మరో నిర్ణయం తీసుకుంంది. వందే భారత్ నుంచి స్లీపర్ రైళ్లను కూడా నడపాలని నిర్ణయం తీసుకున్నాయి. ఇందు కోసం ఇప్పటికే అన్ని విధాలుగా ఏర్పాట్లు చేశారు. అయితే ముందుగా ట్రయల్ రన్ నిర్వహించిన తరువాత వీటిని మెయిన్ ట్రాక్ లోకి తీసుకొస్తారు. అప్పుడే ఇవి ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. అయితే వంద్ భారత్ స్లీపర్ రైళ్లు ఎలా ఉండబోతున్నాయి.ప్రస్తుతం వందే భారత్ ఎక్స్ ప్రెస్ లు పట్టాలపై ప్రయాణం చేస్తున్నాయి. త్వరలో స్లీపర్ రైళ్లు కూడా ఉండనున్నాయి. అయితే వీటిల్లో అదనంగా కొన్ని ప్రత్యేక సదుపాయాలు ప్రవేశపెట్టినట్లు రైల్వే శాఖ నుంచి సమాచారం ఉంది. ఇందులో ప్రయాణికులకు సౌకర్య వంతంగా యూఎస్ బీ ఛార్జర్ ఉండనుంది. వీరి రక్షణ కోసం సీసీ కెమెరాలు, విమానంలో లాగా ఇన్ సైడ్ డిస్ ప్లే, సమాచారం తెలిపే విజువల్ బోర్డులు ఉండనున్నాయి. ఏసీ కోచ్ లో వేడి నీరుకూడా ఉండనుంది. దివ్యాంగుల కోసం ప్రత్యేక బెర్త్ లు అమరుస్తున్నారు.ఇప్పుడున్న వందే భారత్ ఎక్స్ ప్రెస్ రైళ్లు గంటకు 160 కిలోమీటర్ల దూరంలో ప్రయాణిస్తున్నాయి. అయితే కొత్తగా రాబోతున్న వందే భారత్ స్లీపర్ రైళ్లు గంటకు 180 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోనున్నాయి. కొత్త రైళ్ల టికెట్ ధరలు ఎలా ఉంటాయి? అనేది ఆసక్తిగా ఉంది. కానీ రైల్వే సమాచారం మేరకు ఇప్పుడున్న ఎక్స్ ప్రెస్ ధరలకు సమానంగానే స్లీపర్ ధరలు కూడా ఉంటాయని తెలుస్తోంది. అయితే ఇవి పూర్తిగా అందుబాటులోకి వచ్చిన తరువాత ప్రకటించే అవకాశం ఉంది.ఇందులో మొత్తం 16 కోచ్ లు ఉంటాయి. వీటిలో 1 ఫస్ట్ క్లాస్, 2ఏసీ కోచ్ లు 4, 3ఏసీ కోచ్ లో 11 ఉండనున్నాయి.తాజాగ్ ఈ రైలు రైల్వే ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీకి చేరుకోనుంది. మరికొద్దిరోజుల్లో దీనిని ట్రయల్ రన్ నిర్వహిస్తారు. ఆ తరువాత డిసెంబర్ లో ఇది అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. కొత్తగా ప్రారంభించే వందే భారత్ స్లీపర్ రైలు బెంగుళూరు, ఢిల్లీ, ముంబయ్ రూట్లలో ప్రారంభించే అవకాశం ఉంది. వందే భారత్ ఎక్స్ ప్రెస్ కు అనుగుణంగా వీటి సమయాలు మార్చనున్నారు. అయితే కొత్త రైలుకు అనుగుణంగా పైలట్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే లోకో పైలెట్ క్యాబ్ ఆధునీకంగా ఉండనుంది. మరోవైపు ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఇందులో అదనపు సౌకర్యాలు అమర్చనున్నారు. దూర ప్రయాణాలు చేసేవారికి స్లీపర్ రైలు సౌకర్యవంతంగా ఉంటుందని భావిస్తున్నారు.

# ఫ్యామిలీ డిజిటల్ కార్డు...

హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం చేపట్టిన పైలెట్ ప్రాజెక్టు సర్వే కొనసాగుతోంది. ప్రతి నియోజకవర్గంలో ఒక వార్డు, రెండు గ్రామ పంచాయితీలను ఎంపిక చేసుకొని వివరాలు నమోదు చేస్తున్నారు. బృందాలుగా విడిపోయిన అధికారులు ప్రజలతో మాట్లాడి వారి వివరాలు రిజిస్టర్ చేస్తున్నారు. ఫ్యామిలీలో మహిళను యజమానిగా గుర్తిస్తూ సర్వే సాగుతోంది. కుటుంబంలో ఎవరెవరు ఉంటున్నారు. ఎన్ని ఇళ్లు ఉన్నాయి. ఎన్ని ఫ్యామిలీలు ఉంటున్నాయి. చదువుకుంటున్న వాళ్లు ఎంతమంది కుటుంబ పెద్ద ఏం పని చేస్తున్నారు. రేషన్ కార్డు ఉందా, ఆధార్ కార్డులో ఏమైనా తప్పులు ఉన్నాయా.. లేకుంటే సరిచేయాల్సినవి ఏమైనా ఉన్నాయా ఇలా అన్నింటిపై ఆరా తీస్తున్నారు. వీటితోపాటు పెళ్లి అయిన ఆడపిల్లలను ఉంటే రేషన్ కార్డు నుంచి తొలగించడం, కొత్తగా పెళ్లై ఉంటే కొత్త కార్డు ఇచ్చే ఏర్పాటు చేయడం లాంటివి కూడా చేస్తున్నారు. ప్రతి విషయాన్ని అడిగి తెలుసుకుంటున్నారు. ఏ విషయాలు దాచొద్దని అలా చేస్తే భవిష్యత్‌లో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని అధికారులు సూచిస్తున్నారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం రూపొందించిన అప్లికేషన్‌లో ఉన్న ఫార్మాట్ ప్రకారం దఖాస్తు నింపుతున్నారు. ఫ్యామిలీ మెంబర్స్ ఫొటోలు తీస్తున్నారు. నెల ఏడుతో ఈ పైలెట్ ప్రాజెక్టు పూర్తి చేయాలని అధికారులకు గడువు ఇచ్చారు. అందుకే బృందాలుగా విడిపోయి ఉన్నతాధికారుల పర్యవేక్షణలో సర్వే చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో రెండు గ్రామ పంచాయతీలు, వార్డుల్లో ప్రజల నుంచి సమాచారం సేకరిస్తున్నారు. దాని ఆధారంగా డిజిటల్ కార్డు జారీ చేయనున్నారు. తెలంగాణలో ఇకపై అన్ని సంక్షేమ పథకాలు, అన్ని సదుపాయలు పాదర్శకంగా అందించేందుకు ఫ్యామిలీ డిజిటల్ కార్డు తీసుకొస్తున్నట్టు సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. సికింద్రాబాద్‌లో ఈ కార్డు సర్వే పైలెట్ ప్రాజెక్టు ప్రారంభించారు. భవిష్యత్‌లో డిజిటల్ కార్డ్ 30 రకాల సేవలు అందించేదుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఈ పైలెట్ ప్రాజెక్టు 119 నియోజకవర్గాల్లోని ప్రతి రెండు గ్రామ పంచాయతీల్లో ప్రారంభమవుతుందన్నారు రేవంత్ రెడ్డి. పదేళ్లుగా రేషన్ కార్డులు, ఆరోగ్య శ్రీ కార్డులు లేక జనాలు ఇబ్బందులు పడుతున్నారని కొత్త కార్డు జారీలో కూడా సమస్య ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.

అందుకే దాదాపు 30 ప్రభుత్వ శాఖల వద్ద ఉన్న సమచారాన్ని ఒక చోట చేర్చే పనికి శ్రీకారం చుట్టామన్నారు. అందులో భాగంగా 239 ప్రాంతాల్లో పైలెట్ ప్రాజెక్టు చేపట్టినట్టు పేర్కొన్నారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు అమల్లోకి వస్తే మాత్రం అదే రేషన్ కార్డు, అదే ఆరోగ్య శ్రీ కార్డు, అదే ఉచిత బస్ పాస్, అదే రైతు బీమా కార్డు, అదే విద్యార్థులకు ఫీజు రియెంబర్స్‌మెంట్ కార్డు అవుతుందన్నారు రేవంత్. ఒక్క క్లిక్‌తో ఒక ఫ్యామిలీ సమస్త సమాచారం అధికారుల వద్ద ఉంటుందని అన్నారు. ఏ శాఖ ఏ అవసరం కోసమైనా ఈ సమాచారన్ని వాడుకునే వెసులుబాటు కలుగుతుందన్నారు.

# ఒక్కటైన టాలీవుడ్...

హైదరాబాద్: తెలంగాణలో మంత్రి సురేఖ చేసిన కామెంట్స్ దుమారం రేపుతున్నాయి. కేటీఆర్ పై విమర్శలు చేసే క్రమంలో అక్కినేని కుటుంబం పై ఆమె అనుచిత వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా సమంత, నాగచైతన్య మధ్య విడాకులకు కేటీఆర్ కారణమని ఆరోపిస్తూ చేసిన కామెంట్స్ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. సినీ పరిశ్రమ వ్యక్తుల మనోభావాలు దెబ్బతినేలా ఈ వ్యాఖ్యలు ఉన్నాయంటూ ఎక్కువ మంది ఖండిస్తున్నారు. అన్ని వర్గాల ప్రముఖులు, సాధారణ ప్రజలు సైతం సురేఖ చేసిన వ్యాఖ్యలను సమర్థించడం లేదు. అన్ని వర్గాల వారు అక్కినేని కుటుంబానికి అండగా నిలబడుతున్నారు. టాలీవుడ్ అంతా ఏకతాటిపైకి వచ్చి కొండా సురేఖకు వ్యతిరేకంగా మీడియా సమావేశం పెట్టే ప్రయత్నం చేశారు. అయితే ఆ వ్యాఖ్యలను సురేఖ వెనక్కి తీసుకోవడంతో మీడియా సమావేశాన్ని వాయిదా వేసుకున్నారు. కానీ సోషల్ మీడియా వేదికగా మాత్రం సురేఖ తీరుపై నిప్పులు చెరిగారు. వారు వీరు అనే తేడా లేకుండా టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు నాగార్జున కుటుంబానికి సన్నిహితంగా ఉన్నట్లు, ఇతర ఆర్టిస్టులు ఖండించారు. మంత్రి కొండా సురేఖ తీరుపై తీవ్రంగా తప్పుపట్టారు. అయితే ఇది చాలా మంచి పరిణామం. చిత్ర పరిశ్రమకు చెందిన వ్యక్తులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఈ తరహాలో తిప్పి కొట్టడం అనేది ఆహ్వానించదగ్గదే. అయితే గత ఐదేళ్ల వైసిపి పాలనలో మెగాస్టార్ చిరంజీవి కుటుంబం పై చాలాసార్లు అనుచిత వ్యాఖ్యలు చేశారు తోటి సినీ వ్యక్తులు. ఒకరిద్దరు వైసీపీ నేతలు సైతం అప్పట్లో విరుచుకుపడిన సందర్భాలు ఉన్నాయి. కానీ ఆ సమయంలో ఒక్కరంటే ఒక్కరు కూడా స్పందించిన దాఖలాలు లేవు. ఇప్పుడు ఇదే హాట్ టాపిక్ అవుతోందివైసీపీ హయాంలో కొందరి నేతల తీరు అభ్యంతరకరంగా ఉండేది. శాసనసభలో ఏకంగా చంద్రబాబు భార్య భువనేశ్వరి పై అనుచిత వ్యాఖ్యలు చేశారు వైసీపీ ప్రజాప్రతినిధులు. ఆమె నందమూరి తారకరామారావు కుమార్తె. ఎన్టీఆర్ అంటేనే తెలుగు చిత్ర పరిశ్రమ.. తెలుగు చిత్ర పరిశ్రమ అంటేనే ఎన్టీఆర్. ఇలా పెనవేసుకుపోయింది వారి బంధం. అటువంటి ఎన్టీఆర్ కుమార్తెకు ఘోర అవమానం జరిగితే ఒక్కరంటే ఒక్కరు.. తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన వ్యక్తులు స్పందించలేదు. నందమూరి కుటుంబం బాధపడినా ఓదార్చేందుకు ముందుకు రాని పరిస్థితి అప్పట్లో ఉండేది. పైగా తెలుగు చిత్ర పరిశ్రమకు ఎన్టీఆర్ తో పాటు చంద్రబాబు కూడా చేయూతనందించారు. కనీసం ఆ విషయాన్ని గుర్తించి కూడా ఎవరు స్పందించలేదు. కనీసం మాట్లాడలేదు.ఐదేళ్లుగా పవన్ వ్యక్తిగతంగా టార్గెట్ చేసుకోని వైసిపి నేతలేరు. ప్రారంభంలో చిరంజీవి అంటే అభిమానం ప్రదర్శించిన వారు సైతం.. ఎన్నికలకు ముందు అనుచిత వ్యాఖ్యలు చేశారు. పకోడీ గాళ్లు అంటూ ఎగతాళిగా మాట్లాడారు. మరికొందరైతే అంజనాదేవి పేరును ప్రస్తావిస్తూ కూడా తిట్ల దండకం అందుకున్నారు. కానీ ఆ సమయంలో ఒక్కరంటే ఒక్కరు కూడా సినీ పరిశ్రమ నుంచి అభ్యంతరం వ్యక్తం చేయలేదు. మీరు చేస్తున్నది తప్పు అని చెప్పలేదు. కేవలం అప్పట్లో ప్రేక్షకపాత్ర మాత్రమే పోషించారు. పవన్ పై పోసాని కృష్ణ మురళి ఏకంగా తిట్ల దండకమే అందుకున్నారు. అప్పుడు ఆయన తెలుగు చలనచిత్ర అభివృద్ధి మండలి అధ్యక్షుడిగా కూడా ఉన్నారు. అయినా సరే సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తులు ఒక్కరు కూడా స్పందించలేదు.ఇప్పుడు నాగార్జున కుటుంబం పై సానుభూతి చూపిస్తున్నారు. దీనిని తప్పు పట్టలేము కానీ.. ఇదే మనుషులు అప్పుడు ఎక్కడికి వెళ్లారు అన్నది ఇప్పుడు ప్రశ్న. అప్పట్లో తెలంగాణలో కెసిఆర్ అధికారంలో ఉండేవారు. ఏపీలో సీఎం గా జగన్ ఉండేవారు. చిత్ర పరిశ్రమ అంతా హైదరాబాదులో ఉండేది. కెసిఆర్ తో జగన్ స్నేహం కొనసాగించేవారు. అందుకే అప్పట్లో వైసీపీ నేతల తీరుపై చిత్ర పరిశ్రమ వ్యతిరేకించేది కాదు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అందుకే చిత్ర పరిశ్రమ వ్యక్తులు స్వేచ్ఛగా స్పందిస్తున్నారు. అయితే అప్పట్లోనే వైసీపీ నేతల విషయంలో కఠినంగా వ్యవహరించి ఉంటే.. మంత్రి కొండా సురేఖ ఉదంతం అనేది జరిగి ఉండేది కాదు అన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి.

# కేబీఆర్ పార్క్ చుట్టూ అండర్ పాస్... ఫ్లైఓవర్లు

హైదరాబాద్: హైదరాబాద్ మహానగరంలో మార్పు మార్క్.. మూసీ ప్రక్షాళన ప్రతిష్టాకంగా చేపట్టిన తెలంగాణ ప్రభుత్వం, కేబీఆర్ పార్క్ చుట్టూ రోడ్ల విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అండర్ పాస్, ఫ్లై ఓవర్ల నిర్మానానికి అనమతి ఇస్తూ జీవో జారీ చేసింది. మరోవైపు స్పోర్ట్స్ పాలసీపై కూడా మరింత ఫోకస్ పెంచారు తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి.కేబీఆర్ పార్క్ జంక్షన్ నుంచి ఐదు అండర్ పాస్ ఫ్లై ఓవర్లు, కేబీఆర్ పార్క్ చుట్టూ రేడియల్ రోడ్ల విస్తరణకు లైన్ క్లియర్ అయింది. పార్క్ చుట్టూ 6 జంక్షన్ల అభివృద్ధికి రేవంత్ సర్కార్ ఆమోదం తెలిపింది. కెబిఆర్ పార్క్ ఎంట్రన్స్ నుండి..జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్, రోడ్ 45, ఫిలింనగర్, అగ్రసేన్ మహరాజ్ విగ్రహం, బసవతారకం లవైపు అండర్ పాస్ ఫ్లై ఓవర్ల నిర్మాణం చేపడుతారు. రూ.826 కోట్లతో ఆరు జంక్షన్ల అభివృద్ధి చేపట్టనున్నారు. తొలి దశలో 421 కోట్లతో ప్యాకేజీ-1లో జూబ్లిహిల్స్ చెక్ పోస్ట్..కేబీఆర్ పార్క్ ఎంట్రెన్స్ దగ్గర జంక్షన్లను అభివృద్ధి చేస్తారు.యూసఫ్‌గూడ వైపు నుంచి రోడ్డు నెం.45 జంక్షన్ వరకు రెండు లైన్ల ఫ్లైఓవర్లను నిర్మిస్తారు. కేబీఆర్ ఎంట్రెన్స్ ముగ్ధ జంక్షన్ జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్ వరకు 2 లేన్ల అండర్‌పాస్ నిర్మిస్తారు. పంజాగుట్ట వైపు నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు మూడు లేన్ల ఫ్లైఓవర్, కేబీఆర్ ఎంట్రెన్స్ జంక్షన్ నుంచి పంజాగుట్ట వైపు మూడు లేన్ల అండర్ పాస్ ఏర్పాటు చేస్తారు.405కోట్లతో ప్యాకేజీ-2లో.. రోడ్ నెం.45 జంక్షన్‌ను అభివృద్ధి చేస్తారు. రెండో దశలో రోడ్ నెంబర్ 45, ఫిల్మ్ నగర్ జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వైపు వరకు అండర్ పాస్ నిర్మిస్తారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి రోడ్ నెంబర్-45 వరకు రెండు లైన్ల ఫ్లైఓవర్ ఫిలింనగర్ జంక్షన్ 1, అగ్రసేన్ జంక్షన్ నుంచి రోడ్ నెం.45 జంక్షన్ వరకు 2 లైన్ల అండర్‌పాస్ అభివృద్ధి చేస్తారు.ఫిలింనగర్ జంక్షన్ నుంచి అగ్రసేన్ జంక్షన్ వరకు రెండు లైన్ల ఫ్లైఓవర్ నిర్మాణంతోపాటు మహారాజా అగ్రసేన్ జంక్షన్ 1. క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్ నుంచి ఫిలింనగర్ జంక్షన్ వరకు అండర్ పాస్ నిర్మిస్తారు. ఫిలింనగర్ జంక్షన్ నుంచి రోడ్ నెంబర్-12 వరకు రెండు లైన్ల ఫ్లైఓవర్, క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్ 1. కేబీఆర్ పార్కు నుంచి అగ్రసేన్ జంక్షన్ వరకు రెండు లైన్ల అండర్ పాస్ అభివృద్ధి చేస్తారు. అగ్రసేన్ జంక్షన్ నుంచి రోడ్డు నెంబర్-10 వరకు రెండు లైన్ల ఫ్లైఓవర్ నిర్మిస్తారు. ఇప్పటికే పరిపాలన అనుమతులు వచ్చేశాయి. ఇన పనుల వేగవంతమే తరువాయి. అండర్ పాస్ ఫ్లై ఓవర్లు ,రేడియల్ రోడ్లతో కేబీఆర్ ఏరియా రూపురేఖలు ఇక మరో లెవల్‌గా మారనున్నాయి. మరోవైపు నగరాభివృద్ధి సహా అటు క్రీడాభివృద్ధిపై కూడా ఫోకస్ పెట్టారు సీఎం రేవంత్ రెడ్డి. హైదరాబాద్‌ను అంతర్జాతీయ క్రీడా వేదికగా తయారు చేయడం సహా క్రీడాకారులకుమరింత ప్రొత్సాహంఅందించాలనే లక్ష్యంతో స్పోర్ట్స్ పాలసీపై దృష్టిసారించారు సీఎం. క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అందించేలా స్పోర్ట్స్ వర్సిటీ,యంగ్‌ఇండియా కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. దక్షిణ కొరియా కోచ్‌లో శిక్షణ ఇప్పిస్తామన్నారు. చెప్పడమే కాదు స్పోర్ట్స్ పాలసీపై ఫుల్‌గా ఫోకస్ చేశారు సీఎం రేవంత్ రెడ్డి

# పోలీస్ శాఖలో ప్రక్షాళన...

హైదరాబాద్: తెలంగాణలో పోలీస్ ప్రక్షాళన షురూ అయ్యింది. అక్రమ దందాకు వత్తాసు పలుకుతున్న పోలీసు అధికారులపై వేటు పడింది. మల్టీజోన్-2 లోని తొమ్మిది జిల్లాలలో అక్రమ ఇసుక రవాణాను కట్టడి చేయడంలో విఫలమైన ముగ్గురు సీఐలు, 13 మంది ఎస్ఐలను విఆర్ లో పెడుతూ మల్టీజోన్-2 ఐజీపీ వి. సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయంలో ఇప్పటికే సదరు అధికారులను బదిలీ చేయడం జరిగింది.ప్రస్తుతం వేటు పడినవాళ్ళలో సంగారెడ్డి రూరల్, తాండూర్ రూరల్, తాండూరు టౌన్ సీఐలతోపాటు వీపనగండ్ల, బిజినేపల్లి, తెలకపల్లి, వంగూరు, ఉప్పునూతల, సంగారెడ్డి రూరల్, పెద్దేముల్, యాలాల్, తుంగతుర్తి, ఆత్మకూర్(రా), పెన్ పహాడ్, వాడపల్లి, హాలియా, ఎస్ఐలను విఆర్ లో పెట్టారు. వీరిలో కొందరికి ఇసుక అక్రమ రవాణాలో ప్రత్యక్షంగా, పరోక్ష సహకారం ఉండటంతో వారిపై డిపార్ట్‌మెంట్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఐజీ సత్యనారాయణ పేర్కొన్నారు. త్వరలో వీరిని లూప్ లైన్‌కు ట్రాన్స్‌ఫర చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర నిఘా అధికారుల నివేదికలు, ఇతర ఎంక్వయిరీల ఆధారంగా ఈ చర్యలు తీసుకోవడం జరిగిందని వెల్లడించారు.ప్రధానంగా ఇసుక అక్రమ రవాణా ద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతుంది. అదేవిధంగా వాగుల్లో, నిషేధిత నది ప్రాంతాలలో ఎక్కడబడితే అక్కడ విచక్షణ రహితంగా ఇసుకను తవ్వకాలు జరుగుతున్నాయి. అదేవిధంగా పర్యావరణ సమతుల్యానికి భంగం వాటిల్లే అవకాశం ఉండటంతో ప్రభుత్వం, రాష్ట్ర డీజీపీ ఈ విషయంలో సీరియస్‌గా ఉండడంతో ఈ చర్యలు తీసుకోవడం జరిగిందని ఐజీ తెలిపారు. ఇప్పటి నుండి ఎక్కడ కూడా ఇసుక అక్రమ రవాణా జరిగితే సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.అలాగే, కొండమల్లేపల్లి హోంగార్డు, జడ్చర్ల హెడ్ కానిస్టేబుల్ ఆనంద్ అక్రమ ఇసుక రవాణాలో వసూళ్లు పాల్పడటంతో డీఏఆర్ కు అటాచ్ చేయడం జరిగింది. ఇక తదుపరి చర్యలు పిడిఎస్ రైస్ అక్రమ రవాణా మీద ఉంటుందని ఐజీ హెచ్చరించారు. దీనిపై ఇప్పటికే రహస్య విచారణ జరుగుతోందన్నారు. పిడిఎస్ రైస్ అక్రమ రవాణాలో స్థానికులే కాకుండా, అంతర్రాష్ట్రంగా చేసే ప్రధాన నిందితులను పట్టుకుని కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీలకు ఐజీ సత్యనారాయణ ఆదేశించారు. పిడిఎస్ రైస్ అక్రమ రవాణా, అక్రమ ఇసుక రవాణా, గాంబ్లింగ్, మట్కా పూర్తిగా బంద్ కావాల్సిందేన్నారు. గాంబ్లింగ్, మట్కా జరిగితే సంబంధిత పోలీసు అధికారులపై కఠిన చర్యలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు. ఇప్పటికే వికారాబాద్‌లోని మర్పల్లిలో గెస్ట్ హౌస్ లో పేకాట నిర్వహిస్తున్న ప్రభాకర్ సేట్, రఫిక్‌లకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు ఐజీ సత్యనారాయణ. రఫీ మీద సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేయడం జరిగింది. పేద, మధ్య తరగతి వ్యక్తుల నుండి దోపిడి చేసే ఈ గాంబ్లింగ్ పట్ల ప్రభుత్వం చాలా సీరియస్ గా ఉందని ఆయన స్పష్టం చేశారు. మల్టీజోన్-2 లో గాంబ్లింగ్ వాసనే రాకూడదు. జిల్లాల్లో ఎక్కడ కూడా గాంబ్లింగ్ జరగకుండా చూసే బాధ్యత అయా జిల్లాల శాఖ లదే అని ఐజీ సత్యనారాయణ స్పష్టం చేశారు.ఇదిలావుంటే, బాధ్యతాయుతంగా వ్యవహారించాల్సిన పోలీసులు నిర్లక్ష్యం వహిస్తే సహించేదీలేదన్నారు ఐజీ సత్యనారాయణ. ఈ క్రమంలోనే వికారాబాద్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌పై వేటు వేశారు. సీఐ నాగరాజును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఒక మైనర్ బాలికపై జరిగిన లైంగిక దాడి కేసులో అలసత్వం, దర్యాప్తులో అవకతవకలకు పాల్పడినందుకు జోగిపేట ప్రస్తుతం స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎ.నాగరాజును సస్పెండ్ చేశారు..

# టీ 20కు పక్కా ఏర్పాట్లు

హైదరాబాద్: ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో త్వరలో జరగనున్న టీ 20 క్రికెట్ మ్యాచ్ నిర్వహణకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లపై రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉప్పల్ స్టేడియంలో డీసీపీలు, ఏసీపీలు, జీహెచ్ఎంసీ, ఫైర్, ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ అధికార్లతోపాటు హైదారాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, రాచకొండ కమిషనరేట్ పరిధిలో జరగనున్న మ్యాచ్ నిర్వహణకు అవసరమైన అన్ని రకాల సెక్యూరిటీ జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో క్రికెట్ పోటీలు నిర్వహించడం గొప్ప అవకాశం అని, ఎన్ని సవాళ్ళు ఎదురైనా తగిన విధంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, ప్రేక్షకులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్టు పేర్కొన్నారు. టికెట్ల పంపిణీలో ఎటువంటి గందరగోళం లేకుండా చూడాలని నిర్వహణ బృందానికి సూచించారు.ప్రేక్షకులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు అవసరమైన పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. సాధారణ వాహనదారుల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా, ఉప్పల్ ప్రధాన రహదారి మీద ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. స్టేడియం పరిసరాల్లో సీసీటీవీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతీ ఒక్కరి కదలికలూ సీసీటీవీ కెమెరాల్లో నిక్షిప్తం అవుతాయని పేర్కొన్నారు. నకిలీ టికెట్లు అమ్మేవారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని, టికెట్ల పంపిణీ పూర్తి పారదర్శకంగా జరుగుతుందని, ఎటువంటి పుకార్లనూ నమ్మవద్దని తెలిపారు.ఈ సమావేశంలో డీసీపీ మల్కాజ్ గిరి పద్మజ, హెచ్‌సీఏ ప్రెసిడెంట్ జగన్మోహన్రావు, హెచ్‌సీఏ వైస్ ప్రెసిడెంట్ దల్జీర్ సింగ్, డీసీపీ ఎస్బి కరుణాకర్, డీసీపీ క్రైమ్ అరవింద్ బాబు, ఎస్ఓటీ డీసీపీ రమణారెడ్డి, విమెన్ సేఫ్టీ డీసీపీ ఉషా విశ్వనాథ్, అడిషనల్ డీసీపీ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**